Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.6

April 2025



## ఆ రోజు...

5లో

# సిలువకు శత్రువులు

సిలువకు శత్రువులు ఎవరు? బీజేపీ వారా? ఆర్‌యస్‌యస్ వారా? భజరంగ్‌దళ్ వారా? శివసేన వారా? శివశక్తి వారా? వీరు కాదు. మరి ఎవరు?

**1. అనుదినము సిలువను మోయనివారే సిలువకు శత్రువులు:** తన వ్యక్తిగత ఆధ్యాత్మిక జీవితములో అనుదినము సిలువను మోయని వారే సిలువకు శత్రువులు. లూకా 9:23లో "మరియు ఆయన అందరితో ఇట్లనెను - ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను". క్రైస్తవ ప్రపంచంలో మూడు రకాల సిలువలున్నాయి. 1. ఆకారపు సిలువ. దీనిని గుడిలో పెట్టాము, మెడలో వేలాడ దీశాము, ఉంగరాల మీద వేసుకొని అప్పుడప్పుడు ముద్దు పెట్టుకొంటాము. 2. ఆచారపు సిలువ. మనకు భస్మ బుధవారం నుంచి గుడ్‌ఫ్రైడే వరకు వచ్చేదంతా ఆచారపు సిలువ. 3. ఆధ్యాత్మిక సిలువ. ఆధ్యాత్మిక సిలువ అంటే అవమానం, శ్రమ, మరణం. ఇది ప్రతిరోజూ అనుభవించేది. ఈ దినం నేను సిలువను మోయడానికి సిద్ధపడితే "ప్రభువా నేను నీ కొరకు పొందాల్సిన అవమానాన్ని నాకు ప్రసాదించవా?" అని ప్రార్థించాలి. దినదినం చనిపోయే క్రైస్తవునిగా, నీ కొరకు శ్రమపడే క్రైస్తవునిగా, నీ నామం నిమిత్తం అవమానం పొందే క్రైస్తవునిగా ఉంటానని తీర్మానం చేసుకోవాలి. ఇలా తీర్మానించు కోకపోతే సిలువకు శత్రువులు బయటెక్కడో లేరు, లోపలే ఉన్నారు.

**2. సిలువ శక్తిని తక్కువగా ఎంచేవారు:** 1 కొరింథీ 1:18లో "సిలువను గూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి". సిలువలో దేవుని శక్తి ఉంది. అది అనుభవించని వాడు సిలువకు శత్రువే.

**3. నా రక్షణకు సిలువ కార్యం చాలదని అనుకొనేవారు:** నా పాపక్షమాపణ, రక్షణకు యేసుప్రభువు సిలువలో చేసిన కార్యం చాలదు అని అనుకొంటూ దానికి మానవ ప్రయత్నాలు జోడించే వారే సిలువకు శత్రువులు. యేసు ప్రభువు ఉచితంగా సిలువ కార్యాన్ని బట్టి రక్షిస్తాను అంటుంటే కాదని మానవ కార్యాలను జోడించేవారు, ఒక పాపి రక్షణకు సిలువ కార్యం చాలదు అని అనుకొనేవారు సిలువకు శత్రువులు.

**4. కడుపే వారి దేవుడుగా గలవారు:** యేసు పేరుతో సహవాసంలో కనబడుతున్నారు కానీ వారి కడుపే వారి దేవుడు. అంటే లోపల కలిగే శరీర కోరికల్ని తీర్చుకోవడానికి వారు బతుకుతారు.

**5. సిగ్గుపడాల్సిన విషయాల్లో అతిశయపడేవారు:** చాలామంది ఈ లోకంలో చాలా పెద్ద పెద్ద ఇళ్ళు కట్టుకొంటూ అతిశయపడుతున్నారు. పరలోకంలో ఎంతపెద్ద ఇల్లు కట్టుకొన్నారు? అక్కడ నీవు పెట్టిన పెట్టుబడి ఎంత? దేవుని పని ఏమాత్రం చేయని మనం లోకసంబంధంగా చేశామని అతిశయపడుతుంటాము. సిగ్గుపడాలి. 5 లక్షలు ఖర్చుపెట్టి క్రిస్మస్ ప్రోగ్రామ్ పెట్టాము, కలెక్టర్, యంయల్‌ఏ గారు వచ్చారు. గ్రీటింగ్స్ చెప్పారు. స్కిట్స్ వేశాము. కొరియోగ్రఫీ పెట్టాము. భోజనాలు పెట్టాము అంటూ కేవలం 20నిమిషాలు దేవునివాక్యం చెప్పించామని గొప్పగా చెబుతుంటారు. ఇలాంటి పనుల ద్వారా ఎవరి ఆత్మకు ప్రయోజనం కలిగించాము? ఇలాంటి విషయాలను బట్టి సిగ్గుపడాల్సింది పోయి అతిశయపడుతున్నామా? సిలువకు శత్రువులు ఇలానే ఉంటారు. వారు సిగ్గుపడాల్సిన విషయాలను బట్టి అతిశయపడుతుంటారు.

**6. భూసంబంధమైన వాటి మీదనే వారు మనస్సు ఉంచేవారు:** కరోనా వచ్చినప్పుడు చాలామంది ప్రార్థించమని అడిగేవారు. అయితే వారిని నేను ఈ ప్రశ్న అడిగేవాడిని. "దేవుడు తగ్గిస్తాడు. బతికిన తర్వాత మీరు ఏంచేస్తారు?". చాలామంది దగ్గర సరైన సమాధానం ఉండేది కాదు. ఎందుకు బతకాలో వారికే తెలియదు గాని బతకాలని ఉందని అంటారు. మరి కొంతమంది 'మాకు పిల్లలు లేరు, దేవుడు పిల్లల్ని ఇచ్చేటట్లు ప్రార్థించమని" అడుగుతారు. అప్పుడు నేను వారిని 'దేవుడు మీకు పిల్లల్ని ఇస్తే ఏం చేస్తారు?' అని అడిగితే సరైన సమాధానం ఉండదు. మన ఆయుష్షు, ఆరోగ్యం, అంతస్తులు, ఉద్యోగం, పిల్లాడికి, పిల్లకు పెళ్ళి చేయాలనే ఆలోచనలతో, మనసుతో బతుకుతూ ఉంటే పరలోకసంబంధమైన మనసు ఎక్కడ ఉన్నట్లు? జీవితాంతం వాటి కోసమే బతుకుతూ ఉండే మనం కాదా సిలువకు శత్రువులం.

**7. పరలోక సంబంధమైన దృష్టి లేనివారు (ఫిలిప్పీ 3:20,21)**

మనం పరలోక పౌరులం కాబట్టి మన విలువలు లోకంలో ఉన్నవారికంటే గొప్పగా ఉండాలి. లోకస్తుల వలే మేము నరహత్య చేయడం లేదు, వ్యభిచారం చేయడం లేదు అని గొప్పగా చెప్పుకొంటారు. కానీ మనం మన సహోదరుని మీద కోపపడడం లేదని, ఒక స్త్రీని మోహపు చూపు చూడడం లేదని చెప్పగలగాలి. ఎందుకంటే మా అంతరంగంలో మార్పు వచ్చింది అని చెప్పగలగాలి. దేవుడు కోరుకొనేది అంతరంగ విలువలు. మనలో చాలామంది మన వేష, భాష, పద్ధతుల్లో సెలబ్రిటీలను అనుసరిస్తున్నారు. ఇలాంటి విపరీతాలు పనికిరావు. మనం పరలోక పౌరులం, పరలోక పౌరసత్వం కలిగిన వారం. మన భాష, విలువలు, వస్త్రధారణ దేవుని వాక్య ప్రమాణాలకు సరిపోయేవిగా ఉండాలని పౌలు చెబుతున్నాడు. "యేసు రాజుగా వచ్చుచున్నాడు, భూలోకమంతా తెలుసుకొంటారు" అని పాడతాం. నిజమేనా? ఈ రోజు నీవు కట్టుకొన్న ఇల్లు, దాచుకొన్న డబ్బులు, జీవిస్తున్న జీవన విధానం యేసు త్వరగా వస్తాడు అన్నట్టుగానే ఉన్నాయా? మనం పాడే పాటలకు, జీవిస్తున్న జీవన విధానానికి, యేసు త్వరగా వస్తాడు అని చెప్పే మాటలకు పొంతన లేదని లోకస్తులు హేళన చేస్తున్నారు. ఇలాంటి పరలోక సంబంధమైన దృష్టి లేకుండా జీవించే వారు సిలువకు శత్రువులు.

– పి.ఏ.స్వామి, శ్రీకాకుళం

(సదరన్ సర్కార్స్ రెగ్‌కాన్-2024 మూడవ డివోషన్‌లోని భాగం)

# విద్యార్థి జ్వాల



Vol. 31, No. 6. April 2025
A Publication of
Union of Evangelical Students of India



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**



CONTACT

The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com


UPCOMING TOPICS

May: Vison & Mission
June: People in the last days
July: The Man God Uses
August: Evangelism
September: Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# శుభ సందేశం



"పునరుత్థానం చారిత్రక సత్యం కాకుంటే, మరణపు శక్తి జయింపబడకుండా నిలిచే ఉంటుంది. మరణానికి కారణమైన పాపము కూడా అలాగే ఉంటుంది. లోకం క్రీస్తు మరణ ప్రాధాన్యత గుర్తించకుండా ఉంటుంది. దానిని బట్టి విశ్వాసులు ఇంకా తమ పాపములోనే, యేసు నామాన్ని వినక పూర్వం వారెక్కడున్నారో, ఇప్పుడూ అక్కడే ఉన్నట్లవుతుంది" *అని అంటాడు డబ్ల్యు. జె. స్పారో సింప్సన్.*

*పునరుత్థానం జరిగింది కాబట్టి...*

1. ఆయన గురించిన ప్రవచనం, లేఖనాలు వ్యర్థం కాలేదు, కావు – మత్తయి 20:17-19; 1 కొరింథీ 15:3,4
2. మన సువార్త ప్రకటన వ్యర్థం కాదు – 1 కొరింథీ 15:14
3. మన విశ్వాసం వ్యర్థం కాదు – 1 కొరింథీ 15:14,17
4. మన ప్రయాస వ్యర్థం కాదు – 1 కొరింథీ 15:58
5. మన నిరీక్షణ వ్యర్థం కాదు – 1 కొరింథీ 15:19

## లోపలి పేజీల్లో...


- సిలువకు శత్రువులు - 2
- శుభ సందేశం- 3
- శ్రమల్లో దాగిన సిరులు - 4
- ఆ రోజు... - 5
- యేసు చివరి అడుగులు - 9
- సువార్త విలువనెరిగిన గొప్ప భక్తులు - 13
- ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల - 14
- తోటి వారిని క్షమించడం - 15
- పునరుత్థాన శక్తి - 16
- భూలోకాన్ని తలక్రిందులు చేసే వారు - 18
- క్రీస్తు పునరుత్థానం చారిత్రక సత్యం - 20
- ఐడా సోఫియా స్కడ్డర్ - 25
- సిలువలో విజయం - 28
- దోషుండ నేను ప్రభువా - 29
- పౌలు బాటలో - 31
- సిలువ - సవాలు - 32

# శ్రమల్లో దాగిన సిరులు

ఒక ధనవంతుడు తన పిల్లల్ని ఏ పని చేయనియ్యకుండా తన ఇంటిలోనే ఉంచి సకల సౌకర్యాలు ఇవ్వాలనుకున్నాడు. తనకు కావలసినంత ఆస్తి ఉండడం వలన పిల్లలకు కష్టం లేకుండా పెంచాలనే ఉద్దేశ్యంతో అన్నీ తమ కాళ్ళ దగ్గరికే వచ్చే విధంగా ఏర్పాట్లు చేశాడు. ఎండ తగలకుండా నీడపట్టునే ఉంచాడు. బయట ఆడుకోకుండా ఇంటిలోనే ఉంచేవాడు. విద్య కూడా తమ ఇంటి వద్దకే ఉపాధ్యాయుల్ని పిలిచి చెప్పించాడు. ఏ కష్టం లేకుండా పెంచాలనే తపనతో అలా చేసినప్పటికీ విచారకరంగా కొన్ని రోజులకి తన పిల్లలు చాలా అనారోగ్యంతో నిండిపోయారు.

ఎంతో జాగ్రత్తగా, గారాభంగా చూసుకోవాలనుకొన్నా తన పిల్లలు అనారోగ్యానికి గురి అవ్వడానికి ప్రధాన కారణం, వారికి సరైన శారీరక శ్రమ లేకపోవడమే. తమ ఇంటిలో పనిచేసే పెద్దవారు, చిన్నవారు ఆరోగ్యంగా ఉండడానికి కారణం వారికి డబ్బు ఉండడం వలన కాదు గానీ శారీరక శ్రమ చేయడమే అని అతడు గుర్తించాడు. ఎన్నో సౌకర్యాలు అనుభవించే తన పిల్లలకు అనారోగ్యం రావడం, అన్ని కష్టాలు అనుభవిస్తూ ఏ పనైనా చేయడానికి వెనుక తీయని తమ పనివారు ఆరోగ్యంగా ఉండడానికి కారణం శ్రమించడమే అని గుర్తించాడు. ఊహించండి, శారీరక శ్రమ లేకుండా ఆరోగ్యం, చదవకుండా విషయ పరిజ్ఞానం మనకెలా రావో, శ్రమలు లేకుండా ఒక విశ్వాసి జీవితం పరిపూర్ణం కాదు/ ఆరోగ్యంగా ఉండదు.



సర్వశక్తిమంతుడు సకల జనుల ఆశీర్వాదం కోసం ఎన్నుకొన్న మార్గం శ్రమల మార్గమే. ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందం కొరకు అవమానమును నిర్లక్ష్య పెట్టి సిలువను సహించడానికి సిద్ధమయ్యాడు. సర్వ ప్రపంచం తన ఆధీనంలోకి రావడానికి, తన స్వంతం చేసుకోవడానికి సర్వోన్నతుడు వేసిన ప్రణాళిక శ్రమలు అనుభవించడమే. తండ్రి ఇష్టం నెరవేర్చడానికి తాను ఎన్నుకొన్న మార్గం శ్రమలే. శ్రమలను తనంతట తానే ఎన్నుకొన్నట్లు అర్థమవుతుంది. గనుక శ్రమలనుమనం ఎన్నుకోకపోయినా అవి ఎదురైనప్పుడు వాటిని హత్తుకోవాలి.

పౌలు శ్రమల్లో భాగంగా విశ్వాసులను బలపరచాడు. వారిని విశ్వాసంలో పెంచి పెద్దవారిని చేయడాన్ని గురుతర బాధ్యతగా ఎంచుకొన్నాడు. క్రీస్తు ఎవరికోసం శ్రమలను స్వీకరించి సమస్తాన్ని సంతోషంగా ధారపోశారో వారిని క్రీస్తు స్వరూపంలోకి మార్చడానికి పౌలు సమస్తాన్ని త్యజించాడు. వారి బాగోగులే ఆనందంగా, కిరీటంగా, గొప్ప ఐశ్వర్యంగా భావించాడు.

వేలడిక్టరీ ఫంక్షన్స్ జరుపుకొంటున్న మనం కూడా క్రీస్తు మార్గాన్ని అనుసరించి ముందుకు వెళదాం. ఆ మార్గంలో పయనించే ప్రక్రియలో కొంతమందినైనా ఆయనలో స్థిరపరచి గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ ఆశీర్వాదాలను అనుభవిస్తూ, అనేకులకు అందిద్దాం. నిజమైన ఆనందం, ఆరోగ్యం శ్రమల్లోనే ఉన్నాయని నమ్మి, శ్రమల్లో దాగిన సిరులను అనుభవిద్దాం.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# ఆ రోజు....

“దు:ఖము, సంతోషము కలగలిసే ఏకైక రోజు గుడ్ ఫ్రైడే మాత్రమే. మానవుని పాపం పట్ల దు:ఖించే రోజు, మన పాపాల్ని పరిహరించడానికి యేసుక్రీస్తు చేసిన బలియాగము ద్వారా వెల్లడైన దేవుని ప్రేమను గూర్చి సంతోషించే రోజు అది”.

ఒక నూతన ప్రారంభం, నూతన జీవితం ప్రతి ఒక్కరికీ అవసరమే. మానవులందరూ, వారు ఏ సంస్కృతికి చెందినవారైనప్పటికీ, వారి భాష, రంగు ఏదైనప్పటికీ నూతన ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నారు. తమ భారాలన్నీ తీసివేసి, తమ పాపాలన్నీ క్షమించి, తమ దుష్టత్వం రూపుమాపేరోజు కోసం వారందరూ ఎదురు చూస్తున్నారు. అయితే, ఆ రోజు కోసం మనం ఎదురు చూడాల్సిన పనిలేదు. ఎందుకంటే, ‘ఆ రోజు’ వచ్చేసింది.

‘యోమ్ కిప్పూర్” (ప్రాయశ్చిత్తదినము) అనే రోజు యూదా మతంలో ఒక గొప్ప పవిత్రమైన రోజు, మహా విశ్రాంతిదినము. దేవుని పట్ల పరిపూర్ణ గౌరవభావంతో యూదులు ప్రతి సంవత్సరం ‘ఆ రోజును’ జరుపుకుంటారు. ఆ రోజు రేడియో, టి.వి. ప్రసారాలు ఉండవు. షాపులు, రెస్టారెంట్లు మూసివేస్తారు. దాదాపు యూదులందరూ ఉపవాసం ఉంటారు. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు మూతబడతాయి. ఎలాంటి రవాణా సాధనాలు ఉండవు. సంవత్సరంలోని అత్యంత సంతోషకరమైన రోజు అది. ఆ రోజును అందరూ భక్తి శ్రద్ధలతో పాటిస్తారు. ఆ రోజును ఇతర సబ్బాతు దినాలకన్నా ఎంతో పవిత్రమైన సబ్బాతుగా పిలుస్తారు. ఆ రోజుకు ఉన్న గొప్పతనాన్ని మనం అర్థం చేసుకోవాలంటే లేవీయకాండాన్ని మనం జాగ్రత్తగా చదవాలి.

పంచకాండాల్లో అత్యంత నిర్లక్ష్యం చేస్తున్న దివ్యగ్రంథం లేవీయకాండము అనడంలో ఏమాత్రం సందేహం లేదు. పాతనిబంధన గ్రంథంలోని మొదటి ఐదు గ్రంథాలను మోషే రాశాడు. ఆ ఐదు గ్రంథాలను పంచకాండాలు లేదా ‘పెంటట్యూక్’ అంటారు. లేవీయకాండాన్ని దాదాపు మనం చదవము, తెరవము. ఒకవేళ చదివినా మనకు అంత ఆసక్తిగా ఉండదు. దాన్ని మనం ఎలా అన్వయించుకోవాలో అర్థం కాదు. ఆ గ్రంథాన్ని బోధించడానికి ఎవరూ సాహసం చేయరు. అయితే, యూదుల జీవితం దీనికి భిన్నంగా ఉంటుంది. యూదులు తమ పిల్లలకు ఈ ఐదు గ్రంథాలలో ముందుగా పరిచయం చేసే గ్రంథం లేవీయకాండము. అనుదిన జీవితంలో అవసరమయ్యే విలువలు, నైతిక సూత్రాలను తమ పిల్లల్లో పెంపొందించడానికి యూదులు తమ పిల్లలకు ఈ గ్రంథాన్ని భక్తి శ్రద్ధలతో వివరిస్తారు.


ప్రాయశ్చిత్త దినముగా పిలిచేరోజు యూదులకు అతిపరిశుద్ధమైన రోజు. ఈ ప్రాయశ్చిత్త దినాన గత సం॥ము అంతటికీ సంబంధించిన ప్రాయశ్చిత్తాన్ని చేస్తారు. ప్రాయశ్చిత్తం అనే పదానికి ‘పాపానికి పరిహారం చేయుట’ అని అర్థం. లేవీయకాండంలోని 16వ అధ్యాయం ఈ ప్రాయశ్చిత్త దినాన్ని అర్థవంతంగా, దాని నిత్యమైన ప్రాధాన్యతను అద్భుతంగా వివరిస్తుంది.

గాఢాంధకార పాపం, దేవుని పరిశుద్ధత యొక్క గొప్పతనం, మధ్యవర్తి, బలిపశువు, పరిహారంలోని వివిధ రకాలు, మిక్కిలి ఘనమైన యేసుక్రీస్తు పరిచర్య అను అంశాలుగా లేవీయకాండములోని ముఖ్య అధ్యాయాలను విభజించుకొని, వాటిని అధ్యయనం చేద్దాం.

## గాఢాంధకార పాపం

పాపం అనే అంశం చాలా సంక్లిష్టమైనది. ఒక్క పదంతో దాని సంపూర్ణ పరిధిని వివరించలేము. మానవులు దేవునికి విరోధంగా చేసిన నేరాన్ని వివరించడానికి ఈ 16వ అధ్యాయంలో నాలుగు పదాలను వివరించడం జరిగింది. మానవ పాపాన్ని వర్ణించడానికి 16వ వచనంలో ఉపయోగించిన పదం 'అపవిత్రత'. ఇశ్రాయేలీయులు దేవుని నివాసస్థలాన్ని అపవిత్రపరచారు. 21వ వచనంలో ఉపయోగించిన పదం 'అతిక్రమము'. అంటే, దేవుని మీద తిరుగుబాటు. తమను ఐగుప్తు నుంచి విమోచించిన దేవుని మీద, తమకు ధర్మశాస్త్రాన్ని ఇచ్చిన దేవుని మీద వారు తిరుగుబాటు చేశారు. దేవునికి వ్యతిరేకంగా వారు కావాలనే తిరుగుబాటు చేశారు. తద్వారా దేవుని పరిశుద్ధ ఉగ్రత వారి మీదకు వచ్చింది. మూడవ పదం 'దుష్టత్వం'. ఇది కూడా 21లోనే ఉంది. చెడిపోయిన మానవ స్వభావాన్ని తెలియ చేస్తుంది. ఈ వచనంలోనే మానవ పాపాన్ని వర్ణించడానికి ఉపయోగించిన చివరి పదం 'తప్పుడు పనులు'. ఇది రోజూ చేసే పాపాల గురించి మాట్లాడుతుంది.

క్లుప్తంగా చెప్పాలంటే, అపవిత్రపరిచే పాపాన్ని కడిగి, ఇష్టపూర్వకమైన తిరుగుబాటును సరిచేసి, దోషపూరితమైన మానవస్వభావాన్ని నూతనపరచి, దోషాల్ని క్షమించాలి. వీటిలో ఏ పాపము కూడా అంత తేలికగా పోదు. వాటిని తీసివేయాలంటే గొప్ప వెల చెల్లించాలి. మానవుని పాపం దేవున్ని గాయపరచింది. గాయాన్ని దేవుడు విస్మరించలేదు. ఎందుకంటే, ఆయన పరిశుద్ధత విషయంలో రాజీపడలేదు.



## దేవుని గంభీరమైన పరిశుద్ధత

లేవీయకాండములోని ముఖ్య అంశము పరిశుద్ధత. "మీరు పరిశుద్ధులై యుండవలెను. మీ దేవుడనైన యెహోవానగు నేను పరిశుద్ధుడనైయున్నాను" (19:2). కానీ దేవుని అంచనాల్ని అందుకోవడంలో, దేవునిని సంతోషపరచడంలో ఇశ్రాయేలీయులు పదేపదే విఫలమయ్యారు. ఫలితంగా దేవుని ఉగ్రతకు పాత్రులయ్యారు. అహరోను ఇద్దరు కుమారులు నిర్లక్ష్యంగా, యాదృచ్ఛికంగా దేవుని సన్నిధిలోకి ప్రవేశించడం మూలంగా వారు చనిపోయారు. ప్రధాన యాజకుడు తనకు నచ్చిన విధంగా దేవుని సన్నిధిలోకి ప్రవేశించడానికి వీలు లేదు. దేవుడు ఏర్పరచిన పద్ధతిలోనే అతను దేవుని సన్నిధిని సమీపించాలి. అతని వస్త్రధారణ, ప్రవర్తనా ధోరణి, వ్యక్తిగత పరిశుద్ధత అనేవి చాలా ప్రాముఖ్యం. వ. 16:12లో ప్రభువు సూచించిన విధంగా యెహోవా సన్నిధిలో ఉన్న ధూపపీఠము మీద నుంచి ధూపార్తెడు నిప్పులను, తన పిడికెళ్లతో పరిమళ ధూపచూర్ణమును తీసుకొని అడ్డతెరలోపలికి వాటిని తెచ్చి తాను చావకుండునట్లు ఆ ధూపము మేఘమువలె శాసనముల మీదనున్న కరుణాపీఠమును కమ్ముటకు, యెహోవా సన్నిధిని ఆ అగ్నిమీద ఆ ధూపద్రవ్యమును వేయవలెను" (16:12-13). దేవుడు మోషేకు తెలియజేసిన ఈ పద్ధతి ద్వారా దేవుని పరిశుద్ధత ఎంత గాంభీర్యమైనదో మనకు అర్థమౌతుంది.

## మధ్యవర్తి

దేవున్ని సంతోషపరచడానికి, మన పాపాలను పరిహరించడానికి, ప్రత్యక్షగుడారములోని అతిపరిశుద్ధ స్థలములోనికి ప్రవేశింపగలిగే ఒకే ఒక మధ్యవర్తి మనకు అవసరం. ప్రధాన యాజకుడు దేవుని ప్రజలందరికి ప్రతినిధి. అతి పరిశుద్ధస్థలములోనికి ప్రవేశించే అవకాశం అతనికి సంవత్సరానికి ఒక్కసారే లభిస్తుంది. తన వ్యక్తిగత, తన కుటుంబ పాపాల నిమిత్తం అతను తనను తాను పరిశుద్ధపరచుకొని, దేవుని సూచనల మేరకు అతను అతిపరిశుద్ధ స్థలంలోకి ప్రవేశించాలి. అతడు ఒక సేవకుడని, దేవుని సన్నిధిలో, దేవుని ముందు అతను చాలా తక్కువ వాడనే విషయాన్ని సాధారణమైన అతని దుస్తులు తెలియజేస్తాయి. ఇతరుల పాపాల నిమిత్తం అతను పరిహారం చెల్లించకమునుపు అతను తనను తాను పరిశుద్ధపరచుకోవాలి.

## బలిపశువులు - మధ్యవర్తి

ప్రధాన యాజకుడు ప్రభువు వద్దకు రెండు మేకల



ను తీసుకెళ్తాడు. మొదటి మేకను పాపపరిహారార్థ బలిగా అర్పిస్తాడు. రెండవ దానిని అరణ్యంలోకి తోలివేయడం ద్వారా పాపపరిహారాన్ని జరిగిస్తాడు. ప్రజలందరి పాపాల నిమిత్తం మొదటి మేకను వధించి, దాని రక్తాన్ని మందిరములోని అడ్డతెరలోపలికి తీసుకువచ్చి, ఆ తెరమీదను, కరుణాపీఠము మీదను, దాని ముందున్న ప్రదేశము మీదను ప్రోక్షించి దేవుని సన్నిధి వారి మధ్యకు దిగివచ్చునట్లు దేవుని మందిరాన్ని అతను శుద్ధి చేస్తాడు. తర్వాత, ప్రధాన యాజకుడు తన రెండు చేతులను రెండవ మేక తల మీద ఉంచి, ప్రజలందరి దోషాలను, అవిధేయతలను ఒప్పుకొని దానిమీద మోపుతాడు. తర్వాత ఆ మేకను అరణ్యములోనికి తోలివేస్తాడు. ప్రజలందరి పాపముల ను భరిస్తూ ఆ రెండవ మేక అరణ్యంలోకి వెళ్ళి క్రూరమృగాల చేతిలో మరణిస్తుంది. మొదటి మేక తన రక్తముతో దేవుని మందిరాన్ని పరిశుద్ధపరుస్తుంది.

పాపాన్ని పరిహారం చేయడంలోని వివిధ పద్ధతుల గురించి అద్భుతమైన వివరణ ఉంది. ఆ పరిహారానికి దేవుడే ప్రణాళిక వేశాడు.

**మొదటి పద్ధతి,** పాప పరిహారంలో త్యాగం ఉన్నది. లేవీయకాండము ప్రారంభ అధ్యాయాల్లో దహనబలి, పాపపరిహారార్థబలి, అపరాధ పరిహారార్థబలుల గూర్చిన వివరణ ఉన్నది. వీటిలోని ప్రతి బలి దేవుని కృప, క్షమాపణల కోసమే అని తెలియజేస్తున్నాయి. ఈ త్యాగపూరిత పద్ధతులలో 6 దశలు మనం గుర్తిస్తాము. దేవుని ప్రజలు బలిపశువుతో ప్రత్యక్ష గుడారాన్ని సమీపిస్తారు. వారు దాని మీద చేతులు ఉంచి దాన్ని వధిస్తారు. యాజకుడు దాని రక్తాన్ని వివిధ ప్రదేశాలలో ప్రోక్షిస్తాడు. బలిపశువును బలిపీఠము మీద ఉంచి, దహనబలిగా అర్పిస్తారు. తర్వాత దాని మాంసాన్ని తింటారు. దాని వ్యర్థ అవయవాలను పారవేస్తారు.

**రెండవది,** పాపపరిహారం ఒకనికి బదులుగా అర్పించబడుతుంది. పాపపరిహారార్థం రోజున, సాధారణ కార్యక్రమాలతోపాటు జరిగే మరొక కార్యక్రమం రెండు మేకలను తీసుకురావడం. పాప పరిహారార్థబలిగా మొదటిదాన్ని బలిస్తారు. రెండవ మేక పాపాలను అరణ్యములోనికి తీసుకువెళ్తుంది. ఆ రెండింటిలో ఒకదాన్ని చీట్లు వేసి, పాప పరిహారం కోసం ఎంపిక చేస్తారు. దాన్ని వధించి, దాని రక్తాన్ని ప్రత్యక్ష గుడారములోను, ఇతర వస్తువుల మీదను ప్రోక్షించి వాటిని పవిత్రపరుస్తారు.

**మూడవది,** పాపపరిహారార్థబలి పరిహారం కోసం. పాప పరిహారార్థ బలిలో ఉన్న సత్యాన్ని మనం అర్థం చేసుకోవాల్సి ఉంది. ఈ విషయం 17:11లో ఉన్నది. "రక్తము దేహమునకు ప్రాణము. మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీద పోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలోనున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును". బలిపశువు చావు ఇక్కడ ముఖ్యం. ఈ బలిలో ఉన్న ప్రాముఖ్యమైన విషయం ఇదే. దీని అర్థం ఏంటంటే, ప్రాణానికి బదులు ప్రాణాన్ని అర్పించడం జరిగింది. పాపపరిహారం, పాపక్షమాపణ పొందాలంటే రక్తాన్ని చిందించాల్సి ఉన్నది.

## మిక్కిలి ఘనమైన యేసుక్రీస్తు పరిచర్య

ప్రధాన యాజకుడు గొర్రెపిల్ల, బలిపశువు, పశువుల రక్తము వంటి 'పరిహారార్థ దినము'కు సంబంధించిన ఆచారాలన్నీ భవిష్యత్‌లో జరుగబోయే వాస్తవ సంఘటనకు ఛాయలుగా ఉన్నాయి. గొప్ప పాప పరిహారార్థ బలికి, యేసుక్రీస్తుకు అవి సూచనగా ఉన్నాయి. ఈ ఆచారాలను యేసుక్రీస్తుతో పోల్చి ఆయన గొప్పతనాన్ని మనం గమనిద్దాం.

## పోలిక - యేసుక్రీస్తు ప్రభువు గొప్పతనం

ప్రధాన యాజకునివలె యేసుక్రీస్తు ప్రభువు పరిశుద్ధమైన ప్రదేశంలోనికి ప్రవేశించి, మన పాపాల నిమిత్తమై తానే స్వయంగా బలయ్యాడు. గొర్రెపిల్లవలె, మన పాపాల కోసం ఆయన తన రక్తాన్ని చిందించాడు. బలిపశువువలె, పట్టణపు గవినియొద్దకు ఆయన్ను తీసుకెళ్ళారు. ఆయన మన పాపాలను ఆయన మీద వేసుకొన్నాడు. మరొక విధంగా చెప్పాలంటే, యేసుక్రీస్తు ప్రభువే మధ్యవర్తి, బలిపశువు.

## బేధము - యేసుక్రీస్తు ప్రభువు గొప్పతనం

యేసుక్రీస్తు ప్రభువు చేసిన పాపపరిహారార్థ బలిని అర్థం చేసుకోవడానికి ఈ పోలికలు మనకు సహాయం చేస్తాయి. అయితే వాటికి, యేసుక్రీస్తు ప్రభువుకు మధ్య బేధాన్ని అర్థం చేసుకొన్నప్పుడు యేసుక్రీస్తు ప్రభువు గొప్పతనాన్ని మనం అర్థం చేసుకోగలుగుతాము.

**మొదటిది,** ప్రధాన యాజకుడు కూడా ఇతరుల వలె పాపి. అతిపరిశుద్ధ స్థలంలోకి వెళ్ళకముందు తన పాపము కోసం అతను బలి అర్పించాల్సిన అవసరం ఉన్నది. అయితే దీనికి భిన్నంగా యేసుక్రీస్తు ప్రభువు పాపరహితునిగా, పరిశుద్ధునిగా ఈ భూమి మీదకు వచ్చాడు. పాపరహితమైన జీవితాన్ని ఆయన జీవించాడు. తనలో ఏ పాపములేదని ప్రకటించాడు. తనను విమర్శించే వారు కూడా ఆయనలో ఏ దోషము కనిపెట్టలేకపోయారు. ఇతరుల పాపముల నిమిత్తము బలి అర్పించడానికి ఆయన అతిపరిశుద్ధ ప్రదేశములోనికి ప్రవేశించాడు తప్ప తన పాపం కోసం బలి అర్పించడానికి కాదు.

**రెండవది,** ప్రధాన యాజకుడు సంవత్సరానికి ఒక్కసారే అతి పరిశుద్ధ స్థలంలోకి ప్రవేశించేవాడు. ప్రతి సంవత్సరం ఇలానే జరుగుతుంది. అయితే, యేసుక్రీస్తు ప్రభువు విషయానికి వచ్చేసరికి, ఆయన అతిపరిశుద్ధమైన స్థలంలోకి ప్రవేశించి, అందరి కోసం ఒక్కసారే బలి అర్పించాడు. ఈ కార్యమును ఆయన పదేపదే చేయాల్సిన అవసరం లేదు.

**మూడవది,** ప్రధానయాజకుడు గొర్రెల రక్తం, మేకల రక్తం అర్పించేవాడు. ప్రధాన యాజకుడైన యేసుక్రీస్తు ప్రభువు తానే బలిగా మారాడు. మనుష్యులందరి పాపపరిహారార్థం తన రక్తాన్ని చిందించాడు.

**నాల్గవది,** అతి పరిశుద్ధ స్థలములోకి ప్రధాన యాజకునికి మాత్రమే ప్రవేశం కలదు. కానీ, మన మందరం అతిపరిశుద్ధ స్థలములోకి వెళ్ళి, ధైర్యంగా దేవునితో సహవాసం కలిగి ఉండే విధంగా ప్రభువైన యేసుక్రీస్తు మనకోసం ద్వారాలు తెరిచాడు.

**ఐదవది,** ఎడ్లరక్తము, మేకల రక్తము పాపమలినాన్ని తాత్కాలికంగాను, బహిర్గతంగాను శుద్ధి చేసేవి. కానీ, పాప పరిహారార్థంగా చిందించబడిన ప్రభువైన యేసుక్రీస్తు రక్తము మనల్ని బహిర్గతంగాను, అంతర్గతంగాను, మన మనస్సాక్షిని కూడా శాశ్వతంగా శుద్ధి చేస్తుంది.

## ప్రభువైన యేసుక్రీస్తు రక్తము

ప్రభువైన యేసుక్రీస్తు రక్తము మనకు పరిపూర్ణ పాపపరిహారాన్ని కలిగించింది. యేసుక్రీస్తు రక్తము శుద్ధి చేయలేని పాపము లేక పాపములు అంటూ ఏవీ లేవు. ఆయన రక్తం శుద్ధిచేయలేని అపరాధమంటూ ఏదీలేదు. యేసుక్రీస్తు ప్రభువు ప్రధానయాజకుడు, ఆయనే బలిపశువు. పాపపరిహారార్థ బలిగా మరణించిన గొర్రెపిల్ల ఆయనే. పాపాలను భరిస్తూ అరణ్యములోకి వెళ్లగొట్టబడిన గొర్రెపిల్ల ఆయనే. దేవునికి సంపూర్ణంగా లోబడి జీవించిన ఆయన మన పాపముల కోసం చేయబడిన పరిపూర్ణ దహనబలి. మన పాపమలినాన్ని ఆయన తొలగించాడు. మన విమోచన కోసం వెల చెల్లించాడు. దేవునికి మనకు మధ్య ఉన్న తెరను ఆయన చించివేసి, దేవుని సన్నిధిలోకి మనం వెళ్ళి, ఆయనతో అన్యోన్య సహవాసం కలిగి ఉండడానికి మార్గాన్ని సుగమం చేసాడు. ఆయన చేసిన గొప్ప బలియాగము ద్వారా దేవుడు మనిషితోను, మనిషి దేవునితోను సమాధానాన్ని కలిగి ఉన్నారు. పురాతన సాంప్రదాయ వార్షిక బలియాగాలు ఆయనలో పరిపూర్ణంగా నెరవేరాయి.

## శుభ శుక్రవారం - శుభ సందేశం

శుభ శుక్రవారం ఇచ్చే శుభ సందేశం ఏంటంటే, యేసుక్రీస్తు ప్రభువు లోక పాపాల్ని తొలగించాడు. మన పాప పరిహారం కోసం ఆయన తన అమూల్యమైన రక్తాన్ని చిందించాడు. మన అపరాధాలు, దోషాల నిమిత్తమై ఆయన శిక్షను భరించాడు. మనల్ని దేవునితో సమాధానపరిచాడు. దేవుణ్ణి మనతో సమాధానపరిచాడు. సామాన్యమైన మనుష్యులకు ఆయన పరలోక ద్వారాన్ని తెరిచాడు. సులభంగా దేవునితో అన్యోన్య సహవాసాన్ని కలిగి ఉండే అవకాశాన్ని కల్పించాడు. పాపులమైన మనపట్ల దేవునికి ఉన్న ఉగ్రతను ఆయన చల్లార్చాడు. వెల చెల్లించడం ద్వారా పాప దాసత్వము నుంచి మనల్ని ఆయన విడిపించాడు. ఆయన రక్తము మనల్ని, మనస్సాక్షిని శుద్ధి చేస్తుంది. కాబట్టి పాపపరిహారార్థ దినాన్ని గుడ్ ఫ్రైడేగా పిలవడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.

– **జి. సుధీర్ కుమార్,** నేషనల్ స్టాఫ్, గుర్గాన్



# యేసు చివరి అడుగులు

## జీసస్ ఫైనల్ స్టెప్స్

ఏడు రోజులు జరిగే పులియని రొట్టెల పండుగలో మొదటి రోజు పస్కా ఆచరించడానికి యేసు ఆయన శిష్యులు కూర్చున్నారు. యేసు అందరి శిష్యుల పాదాలు కడుగుతూ, ధనాపేక్షతో యేసును అప్పగించడానికి ప్రధాన యాజకుల వద్ద 30 వెండి నాణేలు తీసుకొని ఉన్న యూదా ఇస్కరి యోతు పాదాలు కూడా కడిగాడు. అప్పటికీ అతని హృదయం మారలేదు. తర్వాత యేసు మీలో ఒకరు నన్ను అప్పగిస్తారు అన్నప్పుడు శిష్యులు నేనా! నేనా! అని అడిగినప్పుడు యూదా కూడా వారితో నేనా! అని అడిగాడు. అందుకు ప్రభువు నీవన్నట్లే అని చెప్పినా కూడా యూదా హృదయం అలాగే ఉంది. శిష్యులు అడిగిన ప్రశ్నకు యేసు నేను ఒక ముక్క ముంచి ఎవరికి ఇస్తానో వాడే అని చెప్పి ఒక ముక్క ముంచి యూదాకు ఇచ్చాడు. యూదా సంస్కృతిలో గృహ యజమాని తన అతిథికి ఇలా చేసి గౌరవించడం ఒక ఆనవాయితీ. అది తాను అతన్ని ప్రేమిస్తున్నాననే గుర్తును చూపిస్తుంది. ప్రభువు అతని ప్రేమను కోరుతూ చేసిన చివరి విన్నపాన్ని యూదా తిరస్కరించాడు. అప్పటికీ అతనిలో ఏ మార్పూ రాలేదు. వాడు ఆ ముక్క పుచ్చుకోగానే వాడిలో సాతాను ప్రవేశించాడు. యేసు నీవు చేయునది త్వరగా చేయమనగానే వాడు వెంటనే బయటికి వెళ్ళిపోయెను.

యెరూషలేము ప్రాకారం బయట కొద్ది దూరంలో, ఒలీవల కొండ దిగువన ఉన్న 'గెత్సేమనే' ప్రాంతానికి వెళ్ళి శిష్యులతో మీరు ఇక్కడ కూర్చోండని చెప్పి, పేతురు, యోహాను, యాకోబులను వెంటబెట్టుకొని ఎంతో వేదనతో దు:ఖపడుతూ ముగ్గురు శిష్యులతో మరణమగునంతగా నా ప్రాణము బహుదు:ఖముతో మునిగియున్నది. మీరు ఇక్కడే నాకోసం మెలకువగా ఉండండి అని చెప్పి కొంత దూరం వెళ్ళి సాగిలపడి... తండ్రీ సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగించు, అయినా నా ఇష్టము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్ము అని ఆయన వేదనతో ఆతురముగా ప్రార్థన చేయగా, ఆయన చెమట నేల పడుతున్న గొప్ప రక్తబిందువుల వలె ఆయెను.

సాధారణంగా తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు మెదడు నరాలు చిట్లి ముక్కునుండి, చెవిలోనుండి రక్తం

రావాలి. దీనిని "సెరిబ్రల్ హెమరేజ్" అంటారు. కానీ క్రీస్తుకు అలా జరగలేదు. శరీరం హెమరేజ్ జరిగింది. దీనిని వైద్యభాషలో 'హెమాటిడ్రోసిస్' అంటారు. మానసిక ఒత్తిడి అధికంగా ఉంటే ఇలా జరుగుతుందని కాలిఫోర్నియా వైద్యుడు అలెగ్జాండర్ మెతెరిల్ వివరించాడు.

క్రీస్తు ప్రస్తావించిన 'గిన్నె' ఆయన ముందు ఉన్న భయంకరమైన, క్రూరమైన అనుభవాలకు గుర్తు. మానవుల పాపాన్ని ఆయన మీద వేసుకొని సర్వమానవాళి కోసం పాపముగా చేయబడి ఉన్నాడు. ఈ విషయాలన్నీ ముందుగానే తెలిసి మానవునిగా జన్మించాడు. కొరడా దెబ్బలు భరించలేకో, సిలువ మరణం బాధలవలనో ఆయన ఈ గిన్నె తొలగించుమని ప్రార్థన చేయలేదు. పరిశుద్ధుడైన ఆయన తన తండ్రిని తాత్కాలికంగా వీడి పాపిగా ఉండడం తట్టుకోలేకపోయాడు.

మూడు సార్లు వేదనతో ప్రార్థన చేసి తండ్రి చిత్తానికి తన్ను అప్పగించుకొని ధైర్యముతో లేచి శిష్యుల వద్దకు వచ్చిన యేసుని ఆయన శిష్యుడైన యూదా రోమా సైన్యంతో, మతపెద్దలతో వచ్చి ఆయనను బోధకుడా నీకు శుభమని చెప్పి ముద్దుపెట్టుకొని వారికి అప్పగించెను. పురాతన యూదా సంస్కృతిలో ముద్దు అనేది స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య ఒక సాధారణ పలకరింపు. నిన్ను కలుసుకొన్నందుకు నేను ఆనందిస్తున్నానని చెప్పడం. మన సంస్కృతిలో స్నేహితులను, కుటుంబ సభ్యులను కలిసినప్పుడు కరచాలనం చేసినట్లు. సైనికులు, బంట్రోతులు ఆయనను బంధించి తీర్పు కొరకు ఆయా స్థలాలకు త్రిప్పారు.

## తీర్పు కొరకు ఆయనను తీసుకెళ్ళిన స్థలాలు

1. **యూదా నాయకుల ఎదుట:**

   **రాత్రికాలంలో జరిగిన తీర్పులు:**

   **మొదటిది:** అన్న ముందు - యోహాను 18:13-14; 19-23 (ఈ 'అన్న' ఆ సంవత్సరం ప్రధానయాజకుడైన 'కయప' మామ).

✦ ఇక్కడే పేతురు మొదటిసారి ప్రభువును ఎరుగనని చెప్పాడు.

   **రెండవది:** కయప, సన్హెడ్రిన్ ముందు - మార్కు 14:53-65; లూకా 22:54, 63-65;



మత్తయి 26:57, 59-68, యోహాను 18:24 (కయప ఆ సంవత్సర ప్రధాన యాజకుడు, ప్రజల నాయకుడు, న్యాయాధిపతి, అన్న అల్లుడు).

✦ ఇక్కడ పేతురు రెండవసారి, మూడవ సారి ప్రభువును ఎరుగనని బొంకాడు (మత్తయి 26:69-75; యోహాను 18:15-27)

   **పగలు జరిగిన తీర్పు:**

   **మూడవది:** సన్హెడ్రిన్ ముందు - మత్తయి 27:1; లూకా 22:66-71; మార్కు 15:1

   సన్హెడ్రిన్ - యూదులకు ప్రధాన న్యాయస్థానము. దీనిలో 70 లేక 71 మంది సభ్యులు ఉంటారు. అర్ధచంద్రాకారంలో కూర్చొని ముద్దాయిని ఎదురుగా నిలువబెట్టి తీర్పుతీర్చుతారు.

2. **రోమా నాయకుల ఎదుట:**

   **పగలు జరిగిన తీర్పులు:**

   **మొదటిది:** పిలాతు ముందు - మత్తయి 27:2,11-14; మార్కు 15:1-15; లూకా 23:1-6

   **రెండవది:** హేరోదు ముందు - లూకా 23:6-12

   **మూడవది:** పిలాతు ముందు - మత్తయి 27:15-26; లూకా 23:11-25; మార్కు 15:6-15; యోహాను 18:3,9,19:16

## ఆయన మీద మోపిన నేరాలు

1. తనను దైవసమానునిగా ఎంచుకున్నాడని
2. దేవాలయమును పడగొడతానన్నాడని
3. మోషే ధర్మశాస్త్రమును మీరుతున్నాడని

   ఇవి కయప, సన్హెడ్రిన్ సభముందు మోపినవి.

పై మూడు మతపరమైనవి. పిలాతు, హేరోదు దగ్గర చెల్లవు. వీటికి మరణ శిక్ష పడదు అని ఆలోచించి కుయుక్తిగా ఆయనపై క్రిందున్న రాజకీయనేరాలు మోపారు.

1. తాను రాజునని చెప్పుచున్నాడని
2. కైసరుకు పన్ను ఇవ్వద్దు అని చెప్పుచున్నాడని
3. ప్రజలను రెచ్చగొట్టుచున్నాడని

**ఈ రెండు సభలలో ఆయనమీద మోపిన నేరాలు న్యాయమైనవేనా?**


1. మొదట మరణ శిక్ష అని తీర్పునిచ్చి ఆ తర్వాత విచారించిరి – విచారణకు ముందుగానే తీర్పునిచ్చుట నీతికాదు.
2. యేసుకు విరోధంగా అబద్ధసాక్షులను నిలిపారు – మత నాయకుల సాక్షుల యధార్థతను స్థిరపరచిన తర్వాతనే వారి సాక్ష్యము అంగీకరించాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు.
3. సన్‌హెడ్రిన్ సభ రాత్రి సమయంలో జరుప కూడదనే చట్టము ఉంది– క్రీస్తును రాత్రియందు విచారించుట నేరము.
4. కయప, సన్‌హెడ్రిన్ సభలో, క్రీస్తుకు తన వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వలేదు.
5. విచారణచేసిన రోజే నేరస్థాపన చేయడం, శిక్ష విధించడం చట్ట విరుద్ధము. కనీసం రెండు మూడు దినాల వ్యవధి ఉండాలి.

ఇలా చట్ట ప్రకారము గాక, అన్యాయపు తీర్పుతో పిలాతు పిరికితనంతో, పదవీకాంక్షతో యేసుని సిలువ మరణానికి అప్పగించి చేతులు కడుగుకున్నాడు.

**క్రీస్తును శిక్షించిన విధానం**

ప్యాషన్ ఆఫ్ ది క్రైస్ట్ డైరెక్టర్, నిర్మాతల్లో ఒకడైన మెల్ గిబ్సన్‌ను ఇంటర్వ్యూ చేసి మీరు క్రీస్తు మరణాన్ని అంత క్రూరంగా చూపారేంటి? అని అడిగినప్పుడు.. ఆయన ఇచ్చిన జవాబు.. నేను నా సినిమా ద్వారా చూపించినది, వాస్తవంగా క్రీస్తును శిక్షించిన దానిలో కేవలం 40% మాత్రమే అని అన్నాడు.

పిలాతు వద్దనుంచి క్రీస్తుని 'ప్రేతోర్యమను' అధికారమందిరములోకి తీసుకొనివెళ్ళి (మార్కు 15:16) పై వస్త్రము తీసివేసి ఆయన రెండు చేతులను, కాళ్ళను అక్కడ భూమిలో పాతిఉన్న కొయ్యకు కట్టి 1.5 మీటరు పొడవున్న కొరడా




(దాని చివర గాజు, ఇనుపముక్కలు ఉంటాయి) తీసుకొని 39 కొరడా దెబ్బలు కొట్టారు. అయితే సువార్తల్లో గానీ బైబిల్ మొత్తంలో యేసును 39 కొరడా దెబ్బలు కొట్టినట్లు రాయలేదు. అయితే యూదుల సాంప్రదాయం, చట్టం ప్రకారం 39 కొరడా దెబ్బలు కొట్టి ఉండవచ్చు అనేది అభిప్రాయం మాత్రమే. (ద్వితీ 25:3). అలాగే పౌలుగారిని ఒకటి తక్కువ నలభై కొరడా దెబ్బలు కొట్టారు (2 కొరింథీ 11:24) అని చెప్పిన దాన్ని ఆధారంగా చేసుకొని క్రీస్తును కూడా 39 కొరడా దెబ్బలు కొట్టి ఉండవచ్చు అన్నారు. అయితే పౌలును కొట్టింది యూదులు, యేసును కొట్టింది రోమా సైన్యం. రోమన్స్ యూదా సాంప్రదాయాన్ని అనుసరించారో లేదో తెలియదు. చేసిన నేరాన్ని బట్టి ఇంకా ఎక్కువ కొట్టవచ్చు. ఈ దెబ్బలకే చాలా మంది చనిపోతారు. 40వ సంఖ్య యూదులకు అశుభం (పితరులు 40 సంవత్సరాలు అరణ్యవాసం చేశారు గనుక). యేసును కొరడా దెబ్బలు కొట్టిన తర్వాత తలపై ముళ్ళకిరీటం పెట్టి, రెల్లుతో తలమీద కొట్టి, ముఖము మీద ఉమ్మివేసి, ముఖమునకు ముసుగు వేసి ఆయనను గుద్ది నిన్ను ఎవరు కొట్టారో ప్రవచించు అని హేళన చేశారు (మార్కు 14).

యూదులు ఎంత కఠినంగా వ్యవహరించారంటే... పిలాతు క్రీస్తును కొరడాలతో కొట్టించిన తర్వాత యూదాపెద్దల ముందు నిలబెడతాడు (బహుశా నుజ్జు, నుజ్జు అయిన ఆయన శరీరాన్ని చూసి జాలివేసి ఆయనను విడిచిపెట్టమంటారని తలంచి ఉండవచ్చు కానీ వాళ్ళ హృదయాలు మారలేదు). సిలువ వేయండి, సిలువ వేయండి అనే అరిచారు.

**పిలాతు జీవితం**

ముమ్మారు మీరు ఆయన యందు ఆరోపించిన ఏ నేరము కనిపించడం లేదు, హేరోదుకు కూడా కనబడడం లేదని చెబుతూనే క్రీస్తును సిలువ మరణానికి అప్పగించాడు. (లూకా 23:4,14–15, 22).

పిరికితనంతో పదవిపోతుందని, యూదా అధికారులను సంతోషపెట్టడానికి అన్యాయపు తీర్పునిచ్చిన పిలాతు తన పదవి పదిలంగా ఉంటుందని అనుకున్నాడు గాని ఆ తర్వాత కేవలం

5 సం॥ మాత్రమే గవర్నరుగా పనిచేసి పదవి నుండి వైదొలిగాడు. రెండు సంవత్సరాల తరువాత ఆత్మహత్య చేసుకొని మరణించాడని చరిత్ర చెబుతుంది.

**అధికార మందిరము నుండి 'గొల్గొతా' వరకు**

- ❖ గొల్గొతా – హెబ్రీ, కల్వరి – లాటిన్, కపాల స్థలము – తెలుగు
- ❖ అధికార మందిరము నుండి 'గొల్గొతా' 5 కి.మీ. దూరం ఉంటుంది.

కపాలస్థలము అనగా మానవుని పుర్రెవంటి ఆకారముగల స్థలము ఇది 30 అడుగుల ఎత్తుగల ఒక గుట్ట. ఇది నరహంతకుల శల్యములతో నిండిన ప్రధాన శ్మశాన స్థలం. ఇది యెరూషలేము బయట ప్రాకారమును ఆనుకొనిపోవు ఉన్నత రహదారి పక్కన ఉన్నది.

మరణ శిక్ష పొందవలసినవారు బాహాటంగా, భయంకరముగా ఇచ్చట చంపబడతారు. ఎందుకంటే... వ్యాపారం నిమిత్తం పోవు ప్రయాణికులు ఈ విధమైన చిత్రహింసలతో కూడిన ఘోరమరణం కన్నులారా చూసి భయకంపితులై వారి జీవితంలో ఇటువంటి శిక్షకు కారణమైన చెడుకార్యములు చేయకుండా ఉండడం కోసం.

సిలువపై వ్రేలాడేవారు ఆకలికి, దాహానికి, ఎండకు, చలికి ఇబ్బందిపడి చనిపోయే వరకు వేలాడవలసిందే. అప్పటికీ చావకపోతే కాళ్ళు విరగగొట్టి చంపేస్తారు.

సిలువ వేయడం అనేది పర్షియన్ల శిక్షా విధి. సిలువ మరణం ప్రపంచంలోనే ఘోరమైన మరణం, దేశ, రాజ, దైవ ద్రోహులకు, నరహంతకులకు వేసే శిక్ష. పర్షియన్లకు భూమి పవిత్రమైనది. నేరస్థుడైనవాడు శిక్షను పొందుతూ, చనిపోయేటప్పుడు భూమిని తాకితే భూమి కలుషితమై పోతుందని, సిలువకు వ్రేలాడదీసేవారు. వీరి దగ్గరనుండి రోమన్లు తీసుకున్నారు. రోమన్లు తమ మాతృభూమిలో ఈ శిక్షను అమలు చేయరు. ఆక్రమించిన ప్రాంతాల్లోని నేరస్తులకే ఇలాంటి శిక్ష ఉంటుంది. (ఒక రోమా పౌరుడిని తాళ్ళతో కట్టడం, కొట్టడం నేరం. చంపడం, సిలువ వేయడం లాంటివి వారి ఊహల్లోకి కూడా రావు).

భూమిని, అందలి సమస్తాన్ని సృజించిన సృష్టికర్త శరీరం నేలకు తగిలితే భూమి ఎక్కడ అపవిత్రమైపోతుందో అనిపించేంత అవమానానికి, శిక్షకు గురైయ్యాడు.

నేరస్తులు సిలువ మీద ఉండగా పగలు పక్షులు, రాత్రులు క్రూర మృగాలు వచ్చి బతికి ఉండగానే వారిని పొడుచుకొని తినేవి.

సిలువవేయబడే వారిని అధికార మందిరంలో విపరీతంగా కొట్టి, అడ్డకొయ్య మోయిస్తూ కపాల స్థలానికి తీసుకెళ్తారు. కొంతమంది సైనికులు అటు ఇటు నడుస్తూ ఉంటే ఒక సైనికుడు నిందితుడు ఏ నేరానికి సిలువ ఎక్కబోతున్నాడో ఆ నేరం రాసి ఉన్న పలకను పట్టుకొని నడుస్తాడు. క్రీస్తును అధికార మందిరంలో నుండి సిలువ అడ్డకమ్మిని మోయిస్తూ (మధ్యలో కురేనీయుడైన సీమోను) గొల్గొతాకు సిలువ వేయడానికి తీసుకొని వస్తారు.

Cross (సిలువ లేదా మ్రాను) 'క్రస్' అనే లాటిన్ పదం నుండి పుట్టింది. ఆ దినాలలో నాలుగు రకాల సిలువలు వాడుకలో ఉండేవి.

1. **x** టెగుష్టసా (అంద్రెయను సిలువవేసింది దీనిమీదే)
2. **+** స్టారోస్
3. **T** క్రక్స్ కొమ్మిసా
4. **✝** క్రక్స్ ఇమ్మిస (క్రీస్తును సిలువవేసింది దీనిమీదే)

దీనిలో **I** నిలువ కర్రను 'సిప్‌లెల్స్' అంటారు. అడ్డకర్రను **–** 'పెటూబులమ్' అంటారు. కాళ్ళదగ్గర పెట్టే చిన్న – అడ్డముక్కను 'సెడెల్' అని పిలుస్తారు.

క్రీస్తును సిలువ వేసి దానిపై INRI అనే విలాసము రాయించి పెట్టారు.

I - Iesus - Jesus లాటిన్‌లో **I** అనే అక్షరాన్ని **J** కి కూడా వాడతారు.


N - Nuzarenus - of Nazaret

R - Rex - King

I - Iudaeonum - of Jews

నజరేయుడైన యేసు యూదుల రాజు (యూదుల రాజైన నజరేయుడగు యేసు – యోహాను 19:19)

క్రీస్తుకు చేతుల్లో 6 అంగుళాల మేకులు కాళ్ళకు 10 అంగుళాల మేకు కొట్టి మన కాలమాన ప్రకారం ఉదయం 9 గం॥లకు సిలువ వేశారు.




## క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలు

ఏడు అనే సంఖ్య యూదుల పవిత్రతకు, పరిపూర్ణతకు గుర్తు. బైబిల్లో ఏడు అనే సంఖ్య 120 సార్లకు పైగా వాడబడింది. విమోచన, విజయానికి ఈ సంఖ్య చాలా చోట్ల వాడబడింది.

ఏడు మాటలు మాట్లాడిన కాలవ్యవధి ఆరుగంటలు. మొదటి మూడు మాటలు సుమారు ఉదయం 9 గం।। నుండి 12 గం।।ల వరకు. ఈ మూడు గంటలు వెలుగుఉంది. చివరి 4 మాటలు 12గం।। నుండి మధ్యాహ్నం 3 గం।।ల వరకు. ఇది పగటి సమయమే గాని లోకమంతా చీకటిమయం అయ్యింది (మార్కు 15:25-33).

మొదటి మూడు మాటలు ఇతరులను గురించి 1. శత్రువుల కొరకు ప్రార్థన, 2. పశ్చాత్తాపపడిన వారికి వాగ్దానం, 3. విశ్వాసముతో వెంబడించువారికి ఆదరణ. 4,5 మాటలు తన మనోవేదనను తెలుపుతాయి. 4. మనోవేదన, 5. శరీరవేదన. 6,7 మాటలు విజయాన్ని చూపిస్తాయి. 6. అప్పగించిన పని పూర్తయ్యిందనే తృప్తి కనిపిస్తుంది. 7. ప్రాణాత్మలను గూర్చిన తృప్తి.

ఈవిధంగా నిన్ను నన్ను పాపం నుండి, శాపం నుండి విమోచించడానికి క్రీస్తు మనందరి రక్షణార్థం కల్వరి వైపు అడుగులు వేసి సిలువలో చనిపోయాడు. ఏ యోగ్యతలేని మనకోసం కల్వరిలో చనిపోవడం కడువింతగా ఉంటుంది. తండ్రి తనకు అప్పగించిన పనిని ఎంతో శ్రమ, వేదన, దు:ఖం, అవమానం, దెబ్బలు ఉన్నప్పటికీ ఆయన చిత్తాన్ని విజయవంతంగా ముగించాడు. ఈ సిలువ ప్రేమను జ్ఞాపకం చేసుకుంటున్నామా? ఆయన చిత్తాన్ని మన జీవితాలలో జరిగిస్తున్నామా? ఇంకా మన ఇష్టాలు, ఆశలు, కోరికలే నెరవేర్చుకుంటున్నామా? ఆలోచిద్దాం. ఆయన చిత్తానికి మనల్ని మనం అర్పించుకుందాం.

**- పి. ప్రేమ్ కుమార్,** స్టాఫ్, వైజాగ్

## సువార్త విలువనెరిగిన గొప్ప భక్తులు

**దేవిడ్ బ్రైనార్డ్** - రక్తం కక్కుతున్నా రక్షకుని కొరకు మారుమూల ప్రాంతాలకు వెళ్ళి సువార్త ప్రకటించారు. ఆయన మరణంతోనే మిషనరీ ఉద్యమము ఆరంభమైయ్యింది.

**డేవిడ్ లివింగ్‌స్టన్** - అప్పులకు సెలవు చెప్పి ఆఫ్రికాలో సువార్త ప్రకటించి, అక్కడే చనిపోయారు.

**హడ్సన్ టేలర్** - 'ఇంగ్లాండ్ సుఖం కన్నా చైనాలో సువార్త సేవే మిన్న' అని చైనా వస్త్ర ధారణతో సువార్త ప్రకటించారు.

**సి.టి.స్టడ్** - క్రికెట్ ఆటకు స్వస్థి పలికి క్రీస్తు రాయబారిగా ఆఫ్రికాలో సువార్త ప్రకటించారు.

**అదోనిరామ్ జడ్సన్** - బర్మా ప్రభుత్వం జైల్లో పెట్టినా బైబిల్ తర్జుమా ఆపక సువార్త మోగించారు.

**జిమ్ ఇలియట్** - గన్ చేతిలో ఉన్నా, గమ్య సాధనకై అడవి జాతి వారి బాణాలకు ప్రాణాలర్పించారు.

**విలియమ్ కేరి** - సువార్త నిమిత్తం ఇంగ్లాండ్ నుండి ఇండియాకు వచ్చి స్వదేశానికి తిరిగి వెళ్ళలేదు.

**సాధు సుందర్ సింగ్** - కాషాయ వస్త్రాలు ధరించి కాలి నడకన దేశమంతా తిరుగుతూ సువార్త ప్రకటించారు.

**పండిత రమాబాయి** - సనాతన పండిత కుటుంబంనుండి వచ్చినా సకల ప్రజల రక్షకుడైన యేసయ్యకు సాక్షిగా జీవిస్తూ ఎందరో అభాగ్యులకు అండగా నిలిచారు.

**భక్త సింగ్** - క్రైస్తవుడైనందుకు భార్య, బంధువులు తిరస్కరించి దూరమైనా, క్రీస్తు కొరకు, సువార్త విస్తరణ కొరకు చివరి శ్వాసవరకు పోరాడారు.

**ప్రొ।। ఇనాక్** - స్వంత బిడ్డలు లేకపోయినా, సువార్త ద్వారా కనిన బిడ్డలే తన బిడ్డలుగా భావించి సాగిపోయాడు.

**డా।। స్ట్రెట్** - తమ బిడ్డలను అమెరికాలోనే వదలి, భారత దేశమంతా సువార్త గుర్తులు మిగిల్చి పోయారు.

**పి.సి. వర్గీస్** - భారత దేశ విద్యార్థులను నా ప్రభువు కొరకు గెలుచుకొంటానని భారమైనా, దూరమైనా సువార్తకై దూసుకెళ్ళారు.

**సత్కీర్తి రావు** - సువార్త, సత్ప్రవర్తనకు పెద్ద పీట వేసి తన వివాహాన్ని తేనీటి విందుతో ముగించారు.

**జోసెఫ్ అభిషేక రావు** - అల్సర్‌తో బాధ పడుతున్నా అలుపెరుగక ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల కొరకు ప్రాణమిచ్చారు.



# ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల

ఆజ్ఞను – అతిక్రమించిన
ఆదాముపై దేవుని – ఉగ్రత నిలిచియుండే
తినవద్దని చెప్పిన – పండును తిని
తిన్నని మార్గం – నుండి తొలగిపోయె
తోలివేయబడే – ఏదేను వనము నుండి
తృణీకరించె – జీవాధిపతిని
జీవము నుండి – కోయబడే
మొదటి మానవుని ద్వారా – మరణం దాపురించె
ఆదాము దోషము – అందరిలో వ్యాపించె
మరణము క్రిందికి – మానవాళి నెట్టబడె
పస్కా పశువును – వధించడం ద్వారా పాప
నివృత్తి కలదని – నిర్గమ కాండము నందు
లిఖించబడె – ప్రవక్తద్వారా
పవిత్ర గొఱ్ఱెపిల్ల ద్వారా – ప్రాయశ్చిత్తము కలుగును
ప్రతి కుటుంబములో – పస్కాబలిని ఆచరించండి
ప్రతి ఇంటి – ద్వారబంధపు కమ్ములకు
పూయవలె – గొఱ్ఱెపిల్ల రక్తాన్ని
మరణమును – తప్పించుకొనె
మార్గము ఇలాగు – సూచించబడె
ఇదిగో – దేవుని గొఱ్ఱెపిల్ల
బాప్తిస్మము ఇచ్చే – యోహాను
బిగ్గరగా – చాటిచెప్పె
మనుష్య కుమారునివైపు – మనుషులను నడిపించె
దైవకుమారునిపై – దోషములు మోపబడె
సిలువ వేయుము – సిలువ వేయుము
కేకలతో నిండె – పిలాతు అధికార మందిరం
కల్వరి కొండపైన – క్రతువు నిర్వహించబడె
యజ్ఞము బలియాగము – అర్పించబడె
పస్కా గొఱ్ఱెపిల్లగా – యేసు వధించబడె
యెహోవా దేవుడు – యెరుషలేము నందు
జరిగించిన ప్రాయశ్చిత్త – బలిహోమమిదే
పాపములకొరకు – పాపక్షమాపణ కొరకు
చిందించబడె – "క్రొత్త నిబంధన" రక్తము
ఇదిగో పాపికొరకు – పరిశుద్ధుడు ప్రాణమిచ్చె
మంచి శుక్రవారము – నాడు
మానవ కోటికి – జరిగిన మహామేలు ఇదియే
మానవ చరిత్రలో – మహోన్నత సత్యమిది
ఎఱ్ఱనివైన – పాపములు
హిమమువలె – తెల్లబడును
కల్వరి రక్తమును – కల్వరి మరణమును
లోక రక్షకుని – నమ్మిన వాని
కలుషములు – కడిగివేయబడును
సిలువ చెంత – చేరిననాడు
పాపములకు – ప్రక్షాళనము జరుగును
భూదిగంత – నివాసులారా
నావైపు చూచి – రక్షణ పొందుడి
మరణమై – మరి తిరిగి లేచిన
పునరుత్థానుడు – నిన్ను ఉద్ధరించును గాక

– యస్.సి.హెచ్. ఎలీషా, నర్సరావుపేట

# తోటివారిని క్షమించడం

## (మత్తయి 18:21-35)

### నేపథ్యం

క్షమించడం, క్షమాపణ కోరడం ఒక జ్ఞానయుక్తమైన నిర్ణయం మాత్రమే కాదు, అది ఒక ఆధ్యాత్మిక సామర్థ్యం. మత్తయి సువార్తలో ప్రభువు చెప్పిన క్షమించని సేవకుని ఉపమానంలో క్షమించడం అంటే ఏంటో తెలియజేయబడింది. "ఆ సమయంలోనే పేతురు ఆయన వద్దకు వచ్చి - ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడు మారులు మట్టుకా? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను - ఏడుమారులు మట్టుకే కాదు, డెబ్బది ఏ ళ్ళమారుల మట్టుకని నీతో చెప్పుచున్నాను' (మత్తయి 18:21). ఈ మాటలను బట్టి చూస్తే క్షమాపణకు అంతములేదు అని మనకు అర్థమౌతుంది. ఇది చాలా శక్తివంతమైన వర్తమానము. మనలో చాలామందికి ఇది అసాధ్యమనిపిస్తుంది. కాని ఇది మన జీవితంలో తప్పనిసరిగా కనిపించాల్సిన లక్షణం. ఇంతటి క్షమాగుణానికి మనం ఎదగాలంటే, శక్తి, సహనం కోసం మనం ప్రార్థించాలి.

ప్రభువును నమ్మిన తరువాత విశ్వాసులు ఎక్కువ శ్రమపడేవాటిలో ఒకటి తోటి వారిని క్షమించడం. క్షమించకుండా ఉండడమనే స్వేచ్ఛ మనకు ఇవ్వబడలేదు. క్షమించడంలో మనం పాటించవలసిన ప్రమాణం/స్థాయి లేఖనాలలో స్పష్టంగా ఉంది.

క్షమాగుణం లేదా క్షమించడం అనేది అత్యంత ప్రాముఖ్యమైన భావోద్వేగ, మానసిక లక్షణాలలో ఒకటి. కోపం, పగ, విచారం, నొచ్చుకోవడం, శత్రుత్వం వంటి భావోద్రేకాలు దీని ద్వారా సమసిపోతాయి. సమాధానపడడం, తగ్గి ఉండడం, పశ్చాత్తాపం చెందడం, పరిహారం చేయడం వంటివి ఇందులో ఇమిడి ఉన్నాయి.

### ప్రశ్నలు


1. ఈ పాఠ్యభాగంలో ఎవరెవరున్నారు?
2. పేతురు ఎందుకు ఈ ప్రశ్న యేసును అడిగి ఉండవచ్చు?



3. ఈ పాఠ్యభాగం ద్వారా రాజుయొక్క స్థాయిని, గుణగణాలను వివరించండి?
4. మొదటి దాసుని గుణలక్షణాలు ఏవి?
5. రాజు క్షమాపణను బట్టి, మొదటిదాసుడు రెండవ దాసుని పట్ల ఏ రీతిగా ప్రతిస్పందించి ఉండాలి?
6. తోటి దాసులు రాజుకు విన్నవించుకోవడం వెనుక ఏయే కారణాలుండవచ్చు?
7. ఈ పాఠ్యభాగంలో మనల్ని ఎవరితో పోల్చు కోవచ్చు? ఎందుకు?
8. సహవాసంలో తోటి సహోదరులపట్ల మన బాధ్యతలేవి?
9. క్షమించబడినప్పటికీ, ఎందుకు మొదటి దాసుడు క్షమించలేకపోయాడు?
10. రాజు తన ప్రజలనుంచి ఏమేమి కోరుకొంటున్నాడు?

క్షమించలేకపోవడం మన పాతస్వభావం. క్షమాపణ రుచి చూసినవారే క్షమించగలరు. క్షమించడం ప్రేమించడంలో ముఖ్యభాగం. అది దేవుని స్వభావం. మనయందు నివసిస్తున్న ఆత్మదేవుని మూలముగా మనకది సాధ్యమే.

- విజే డెస్క్



# పునరుత్థాన శక్తి

యేసుక్రీస్తు చనిపోయి మూడవ దినాన తిరిగి లేవడం పునరుత్థానం. ఇది మరణంపై విజయం. ఇతర విశ్వాసాలకు క్రైస్తవ విశ్వాసానికి ప్రధానమైన తేడా లేక విశిష్టత ఇదే. పునరుత్థానమనేది క్రైస్తవ్యం యొక్క శుభప్రదమైన నిరీక్షణ.

పాతనిబంధనలో మరణం చూడకుండా కొని పోబడిన హనోకు, ఏలియా, రూపాంతర కొండపై యేసుప్రభువుతో మాట్లాడిన మోషే, ఏలియాలు యేసు మృతి చెంది తిరిగి లేవడం పునరుత్థాన భావనను ఋజువు చేస్తున్నాయి.

ఆదాము నిరంతరం జీవించడానికి సృష్టింప బడ్డాడు. కానీ పాపం మరణాన్ని తీసుకొని వచ్చింది. పాపపు స్థితిలో నిరంతరం జీవించడం ప్రమాదకరం. దేవుడు పాపపరిష్కారానికి ప్రణాళిక రచించాడు.

మరణమైన తర్వాత నరులు తిరిగి బ్రతుకుదురా? (యోబు14:14) అనే యోబు ప్రశ్నకు యెషయా గ్రంథంలో దేవుడు సమాధానమిచ్చాడు. దానియేలు గ్రంథంలో ఉత్తరమిచ్చాడు. తర్వాత యోబుకే ఆ నిశ్చయత కలిగింది. మరెన్నడూ ఉండకుండా ఆయన మరణమును మ్రింగివేయును (యెషయా 25:8). మృతులైన నీవారు బ్రతుకుదురు. నా వారి శవములు సజీవులగును (యెషయా 26:19). సమాధులలో నిద్రించు అనేకులు మేల్కొనెదరు. కొందరు నిత్య జీవము అనుభవించడానికి, కొందరు నింద పాలవ్వడానికి నిత్యముగా హేయులగుటకు మేలుకొనెదరు (దాని 12:2). నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు (కీర్తనలు 16:10) వచనాలు పునరుత్థానాన్ని దాని తర్వాత వచ్చే నిత్య జీవాన్ని తెలియజేస్తున్నాయి. శ్రమల తర్వాత యోబుకు కలిగిన నిశ్చయత, దేవుడిచ్చిన ప్రత్యక్షత 'నా విమోచకుడు సజీవుడు, ఆయన భూమిమీద నేను నిలుస్తాను. ఆయనను కన్నులారా ఈ శరీరంతోనే చూస్తాను. పాతనిబంధనలోని వచనాలు స్పష్టంగా పునరుత్థానాన్ని రుజువు చేస్తు న్నాయి (యోబు 19:25-27).

కొత్తనిబంధనలో పరిసయ్యుల విశ్వాసం, మార్తా, మరియల విశ్వాసం యేసు తన పునరుత్థానాన్ని గూర్చిన ప్రకటన, ఆయన తిరిగి లేవడం పునరుత్థానానికి రుజువులు.

మనుష్యులు మరణం తర్వాత జీవిస్తారు (తిరిగి లేవడం కాదు) అని నమ్మే మతాలు ఈ ప్రపంచంలో ఉన్నాయి. హైందవ మతం అనేక జన్మలను నమ్ముతుంది. ఇస్లాం మరణం తర్వాత జీవితాన్ని నమ్ముతుంది. ఐగుప్తీయులు మమ్మీలతో వారి ఇష్ట వస్తువులు ఉంచడం అనేది మరణం తర్వాత మనుష్యులు జీవిస్తారని తెలియజేస్తుంది. గ్రీకులు ఆత్మకు చావులేదు కాబట్టి పునరుత్థానం లేదని నమ్ముతారు. నాస్తికులు కూడా మరణం తర్వాత జీవితాన్ని నమ్మరు. కానీ కోమాలోకి వెళ్ళి తిరిగి బతికిన వారందరు మరణం తర్వాత జీవం ఉందని ధృవీకరిస్తున్నారు. వీటిని 'నియర్ డెత్ ఎక్స్‌పీరి యన్స్'లు అంటారు.

యేసుక్రీస్తు తిరిగి లేచిన తర్వాత ఈ భూమి మీద 40 దినాలు జీవించారు. 10 సార్లు ఆయన శిష్యులకు, ఇతరులకు కనిపించారు. అందులో 500 మందికి ఒక్కసారే (1 కొరింథీ 15:6) ప్రత్యక్షమవ్వడం ఒక గొప్ప విషయం. ఎమ్మాయికి వెళ్ళే మార్గంలో మనుష్యులతో తాను నడిచి వారి మనస్సులు, కళ్ళు తెరవడం చాలాసేపు కొనసాగిన విషయం. యేసుక్రీస్తు తిరిగి లేవలేదని అనేక తప్పుడు సిద్ధాంతాలు వచ్చినా వాటిని సరైన ఆధారాలతో నిరూపించలేక పోయారు.

## పునరుత్థానం యొక్క ఉద్దేశం, అన్వయం

1. యేసు దేవుని కుమారుడిగా నిరూపించబడడం – రోమా 1:4
2. మనము నీతిమంతులముగా తీర్చబడ్డాము – రోమా 4:25
3. ఆయనను నమ్మిన వారికి మరణం తర్వాత నిత్య జీవమును గూర్చిన నిశ్చయత ఇవ్వబడింది – 1 కొరింథీ 15:17-19).

ఫ్రెడ్రిక్ నీచే నిహిలిజానికి పితామహుడు. జీవితానికి అర్థం లేదు, జీవిత అంతం మరణమే అని అన్నాడు. ఇదే భావనను ప్రస్తుతం కొంతమంది సద్గురులు బోధిస్తున్నారు.

సిగ్మండ్ ఫ్రాయిడ్ జీవిత లక్ష్యం మరణమే అన్నాడు. కానీ యేసుక్రీస్తు ప్రభువు పునరుత్థానాన్ని జీవాన్ని నేనే, నాయందు విశ్వాసముంచిన వాడు చనిపోయినప్పటికీ మరలా బతుకుతాడు. బ్రతికి నాయందు, విశ్వాసముంచువాడు మరెన్నటికీ చనిపోడు (యోహాను 11:25,26) అని చెప్పాడు. పునరుత్థానం, మానవుని శత్రువైన సాతాను, మరణం మీద విజయాన్ని ఇస్తుంది. యేసు మరణపు ముల్లును విరిచి (1 కొరింథీ 15:55,56) మనకు విజయాన్ని ఇచ్చాడు.

## శిష్యులపై పునరుత్థాన ప్రభావం

1. యేసుక్రీస్తు తిరిగి లేచిన తర్వాత అది వారికి ధైర్యాన్ని ఇచ్చింది. సువార్తను, ఈ శుభప్రదమైన నిరీక్షణను ధైర్యంగా ప్రకటించారు.
2. పునరుత్థానం అనే సత్యానికి సాక్షులుగా ఉన్నారు. ఈ సత్యాన్ని ధైర్యంగా ప్రకటించారు.
3. ఆయన తిరిగి లేచినందున ఈ సత్యం కోసం వారు శ్రమపడడానికి, హింసించబడడానికి ఇష్టపడ్డారు.
4. వారు ఇతర దేశాలకు మిషనరీలుగా వెళ్ళారు.
5. ఈ సత్యం కోసం హతసాక్షులయ్యారు.

పునరుత్థానుడైన యేసుక్రీస్తు యాకోబుకు కనిపించాడు. పౌలుతో మాట్లాడాడు. యోహానుకు, స్తెఫనుకు దర్శనంలో కనిపించాడు. పునరుత్థానం శిష్యుల్లో ధైర్యాన్ని, ప్రోత్సాహాన్ని, నిరీక్షణను కలుగజేసింది.

## పునరుత్థాన శరీరం లక్షణాలు

మనము దిగంబరులముగా కాకుండా వస్త్రము ధరించుకొనిన వారంగా కనబడతాం. ఈ శరీరము పరలోక సంబంధమైనది. అక్షయమైనది. ఆత్మ సంబంధమైనది. బలమైనది, అమర్త్యమైనది, మహిమగలది. దేవుడిచ్చే ఈ శరీరంతో ప్రభువు వద్ద నిరంతరం నివసిస్తాం.

## పునరుత్థాన శక్తి

పౌలుగారి అభిలాష ఏంటంటే, పునరుత్థాన బలాన్ని ఎరగాలి (అనుభవించాలి). ఈ పునరుత్థాన శక్తి దేవుని శక్తి. యేసుక్రీస్తు ఆరోహణుడైన తర్వాత ఈ పునరుత్థాన శక్తి వారి మీద కుమ్మరించబడింది. పరిశుద్ధాత్మ శక్తి మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు నాకు సాక్షులై ఉందురు (అపో. కా. 1:8) అని రాయబడింది. అలాగే వారు క్రీస్తు కోసం సాక్షులుగా ఉన్నారు.

అపొస్తలుల కార్యాలలో పదే పదే చెప్పబడిన మాట 'పరిశుద్ధాత్మతో నింపబడిన వారై (పరి శుద్ధాత్మతో వశపరచబడిన వారై). వారు పరి శుద్ధాత్మతో నింపబడినప్పుడు ఆరాధించారు, అద్భుతాలు చేశారు, స్వస్థపరచారు, దయ్యాలను వెళ్ళగొట్టారు, చనిపోయినవారిని లేపారు, అబద్ధాన్ని ఖండించారు.

## మన దైనందిన జీవితంలో పునరుత్థాన శక్తి

మన ఆత్మీయ జీవితానికి పునరుత్థాన శక్తి అవసరం. పాపం మీద విజయం సాధించడానికి, ఆయనకు సాక్షులుగా ఉండడానికి, సువార్త ప్రకటించడానికి పునరుత్థాన శక్తి మీద ఆధారపడాలి. ఆత్మచేత (రోమా 8:13) శరీర క్రియలను చంపిన యెడల మీరు జీవించెదరు అనే వాక్యం మనం ఆత్మయందు బలంగా ఉండాలని సూచిస్తుంది. ఆత్మానుసారంగా జీవించాలి అనే తపన మనల ను పునరుత్థాన శక్తి (పరిశుద్ధాత్ముని శక్తి) మీద ఆధారపడేటట్లు చేస్తుంది (గలతీ 5:16).

విశ్వాసులుగా పరిశుద్ధాత్మ శక్తి మీద ఆధారపడుతూ, పరిశుద్ధాత్మకు లోబడుతూ, నియం త్రించబడుతూ నడుద్దాం. దేవుని కృప మనకు ఎల్లప్పుడూ తోడుగా ఉండును గాక!

– జి, జెర్మియా ప్రసాద్, స్టాఫ్, నంద్యాల

# భూలోకాన్ని తలక్రిందులు చేసే వారు

ఇప్పుడు వాళ్ళు 'భూలోకాన్ని తలక్రిందులు చేసేవాళ్ళు'[1]. యేసుతో తిరిగినంత కాలం ఆయన చెబుతున్న విషయాలు పెద్దగా బుర్రకెక్కినట్లు కనబడలేదు. గాయాలలో వేలుపెట్టి చూస్తేనే గానీ ఆయన మరణాన్ని జయించాడన్న సంగతి వాళ్ళకి నమ్మబుద్ధి కాలేదు. గురువులా దయ్యాలను వెళ్ళగొట్టబోయి వల్లకాక వెనుదిరిగిన శిష్యులు వాళ్ళు. అలాంటి వ్యక్తులు ఇప్పుడు లోకాన్ని తలక్రిందులు చేస్తున్నారు. క్రీస్తు పునరుత్థానాన్ని అంతులేని ఆత్మస్థైర్యంతో వాళ్ళు ప్రకటిస్తుంటే అధికారులు, ప్రధానులు ముక్కున వేలేసుకొంటున్నారు. వేలకు వేల మంది యేసే ప్రభువని విశ్వసిస్తున్నారు.


అనూహ్యమైన ఈ మార్పు ఎలా సాధ్యమయ్యింది? ఇంత గొప్ప శక్తి, ధైర్యం వారిలోకి ఎలా వచ్చి చేరాయి? కారణాలు మనం ఊహించలేనంత కష్టమైనవి కాదు. అపొస్తలుల కార్యాల గ్రంథంలోని ప్రారంభ అధ్యాయాలను పరిశీలిస్తే ఇట్టే అర్థమైపోతాయి.

### 1. వాళ్ళు ఆత్మశక్తిని పొందారు

పరిశుద్ధాత్మ మీ మీదకి వచ్చేవరకు యెరుషలేము లోనే వేచి ఉండమని యేసు చెప్పిన సూచనను వాళ్ళు శిరసావహించారు. పెంతెకొస్తు రోజున అగ్నినాల్కల రూపంలో దిగివచ్చిన ఆత్మ అభిషేకాన్ని అనుభవించారు. ఇక ఆ రోజు నుంచి ఆత్మ స్వాధీనంలోనే ప్రతి అడుగూ వేశారు. పరిశుద్ధాత్మ మీ మీదకి వచ్చినప్పుడు మీరు శక్తి పొందుతారు అని యేసు చెప్పిన మాట అక్షరాలా నెరవేరింది[2]. అదే శక్తి వారి మాటల్లోనూ చేతల్లోనూ దర్శనమిచ్చింది. ఓటమి కెరటాలను అధిగమించి వాళ్ళు గెలుపు తీరాలను చేరుకొన్నారు. ఒకప్పుడు వెక్కిరించిన దయ్యాలు ఇప్పుడు గడగడ వణకడం ప్రారంభించాయి. వాళ్ళ నీడ పడితే చాలు రోగాలు నయమవుతున్నాయి[3]. ఒకప్పుడు లోకం వాళ్ళని తలక్రిందులు చేసింది, ఇప్పుడు వాళ్ళు లోకాన్ని తలక్రిందులు చేస్తున్నారు. సందేహంలేదు, అది పరిశుద్ధాత్మ దేవుని శక్తే.

### 2. వాళ్ళు ప్రార్థనతో కదిలారు

ప్రార్థన వాళ్ళ చేతిలో ఆయుధం. ఆటంకాలన్నిటినీ దానితోనే ఛేదించుకుంటూ ముందుకు వెళ్ళారు. వాళ్ళ ప్రార్థనతో భూమి కంపించడమే కాదు యెరూషలేములో ప్రకంపనలు మొదలయ్యాయి. పళ్ళు బయట పెట్టి లోకం వాళ్ళని భయపెట్టినప్పుడు ప్రార్థనాగదిలోనే వాళ్ళు ధైర్యాన్ని పోగు చేసుకున్నారు[4]. వాళ్ళు ప్రారంభించిన విమోచనోద్యమానికి ప్రార్థనే ఇంధనం అయ్యింది. ప్రార్థనే వాళ్ళ హృదయ స్పందనలకు ప్రాణవాయువు



అయ్యింది. మతసాంప్రదాయ పునాదుల్ని ప్రార్థనతో పెకలించారు. శత్రుసామ్రాజ్యాన్ని ప్రార్థనతోనే పడద్రోశారు. గెత్సెమనే తోటలో రక్తబిందువుల మధ్య తమ నాయకుడు సాతానుని ఓడించిన వైనం వాళ్ళ మనస్సుల్లో నాటుకుపోయింది. ఏ యుద్ధాన్నైనా ప్రార్థనతోనే గెలవాలని వాళ్ళకి అర్థమైపోయింది. ఆశ్చర్యంలేదు, లోకం తోకముడిచింది.

### 3. వాళ్ళు సాక్షులుగా నిలిచారు

యేసు వాళ్ళను పరిశుద్ధాత్మ శక్తితో నింపింది అందుకే. మీరు సాక్షులై ఉండాలి అని వారితో చెప్పాడు. హతసాక్షులయ్యే వరకు వాళ్ళు అదేపని మీద ఉన్నారు. న్యాయస్థానంలో నిలబడి చూసింది చూసినట్లు చెప్పేవాళ్ళే సాక్షులు. ప్రజా కోర్టులో నిలబడి ఇప్పుడు వాళ్ళు చేస్తున్నది అదే. మీరు చంపి పాతిపెట్టిన క్రీస్తు తిరిగి సమాధిలో నుంచి లేవడం మేము చూశాం అంటున్నారు వాళ్ళు[5]. మరి చంపిన వాళ్ళు ఊరుకుంటారా? ఊరుకున్నా ఊరుకోకపోయినా మేము మాత్రం చూసింది చెప్పి తీరతామని పట్టుబట్టారు. దేవుని మాట వినాలా, మీ మాట వినాలా[6], అని ఎదురు ప్రశ్నించారు. అందరూ క్రీస్తు చనిపోయాడనే నిర్ణయానికొచ్చేస్తుంటే వాళ్ళు చూస్తూ ఉండలేక పోయారు. ఎందుకంటే వాళ్ళు పునరుత్థానుడైన క్రీస్తును తాకారు, విన్నారు, నిదానించి చూశారు. ఇక వాళ్ళనెవరు ఆపగలరు? క్రీస్తు పునరుత్థానం వాస్తవం. అదే మానవుని సమస్యల పరిష్కారం. ఇదే లోకాన్ని కదిలించిన వాళ్ళ సందేశం.

### 4. వాళ్ళు కలిసి మెలసి ఉన్నారు

దర్శనాన్నే కాదు ఆస్తిని కూడా వాళ్ళు కలిసి పంచుకొన్నారు[7]. కష్టమొచ్చినా సుఖమొచ్చినా కలిసే అనుభవించారు. మనుషులు వేరైనా వాళ్ళ మనసు ఒక్కటే. శరీరాలు వేరైనా వాళ్ళ హృదయ స్పందన ఒక్కటే. వాళ్ళందరి గమ్యం ఒక్కటే, గమ్యం వైపు వారు వెళ్ళే మార్గమూ ఒకటే. వాళ్ళందరిదీ ఒక్కటే మాట. ఎందుకంటే సాక్ష్యం చెప్పేవాళ్ళంతా ఒకే మాట మీద నిలబడాలి. లేకుంటే సాక్ష్యం బలహీనమై పోతుంది. అందుకే ఐక్యతను చెడగొట్టే చీడపురుగుల్ని వాళ్ళు సహించలేకపోయారు. పచ్చని సహవాసాన్ని పాడుచేసే సాతాను ఏజెంట్లను వాళ్ళు నిలదీశారు. పాపం ఒప్పుకొని పశ్చాత్తాపపడని వారిని పాతిపెట్టేశారు[8]. ఒకప్పటి అభిప్రాయ బేధాలు వారిలో



ఇప్పుడు లేవు. ఏ కుర్చీలో ఎవరు కూర్చోవాలి అన్న మీమాంసను వాళ్ళెప్పుడో జయించేశారు. పదవులు, హోదాలకు వాళ్ళు అతీతులు. అలాగే ఉంటారు మరి, లోకాన్ని తలక్రిందులు చేసేవారు.

### 5. వాళ్ళు కష్టాలను ఓర్చుకొన్నారు

వాళ్ళు నడిచింది పూలబాట కాదు, సిలువబాట. క్రీస్తు మోసినట్లు వాళ్ళూ తమ సిలువల్ని మోశారు. ముళ్ళూ, రాళ్ళూ, వాళ్ళ కాళ్ళకూ గుచ్చుకొన్నాయి. నన్ను ద్వేషించిన లోకం మిమ్మల్నీ ద్వేషిస్తుంది అని యేసు ముందే హెచ్చరించాడు[9]. నన్ను చంపుతున్న ఈ లోకం మిమ్మల్ని కూడా వదిలిపెట్టదని కుండబద్దలు కొట్టాడు. అయినా వాళ్ళు సంతోషంగా ముందుకు సాగారు. ఆయనలాగే అన్నిటినీ సహించారు. రాబోయే ఆనందం కోసం అవమానాన్ని నిర్లక్ష్యపెట్టిన క్రీస్తే వారికి ఆదర్శం[10]. సిలువను సహించి దేవుని సింహాసనం మీద ఆసీనుడైన ఆయనను చేరుకోవడమే వారి లక్ష్యం. చావడానికి వాళ్ళు భయపడలేదు, ఎందుకంటే వాళ్ళు పునరుత్థానాన్ని చూశారు. వాళ్ళలో కొందరిని లోకం తలక్రిందులుగా సిలువ వేసింది. కానీ తలక్రిందులైన ఈ లోకానికి బహుశా ఆ సిలువ సరిగానే కనిపిస్తూ ఉంటుంది.

– డా. తాళ్ళూరి ప్రసాద్

1. అపొ.కా. 17:6, 2. అపొ.కా. 1:8, 3. అపొ.కా. 5:15, 4. అపొ.కా. 4:31, 5. అపొ.కా. 3:15, 6. అపొ.కా. 4:19, 7. అపొ.కా. 4:32, 8. అపొ.కా. 5:10, 9. యోహాను 15:18, 10. హెబ్రీ 12:2

> His voice leads us not into timid discipleship but into bold witness.
>
> - Charles Stanley




# క్రీస్తు పునరుత్థానం చారిత్రక సత్యం

శాస్త్రీయజ్ఞానం ఆధారసహితమైనది హేతు బద్ధమైనది కానీ విశ్వాసం పరీక్షింపరానిది, ప్రశ్నింపరానిది అని హేతువాదులు తరచూ మాట్లాడటం వింటూవున్నాము. నిజంగా విశ్వాసం అసత్యీకరణకు (Falsification) తావులేనిదా? ఆధారాల వెలుగులో మార్పుకు అంగీకరించక పిడివాదం చేసేదే విశ్వాసమా? క్రైస్తవ విశ్వాసం హేతుబద్ధమైన, సత్యపరీక్షకు నిలిచే విశ్వాసమేనా? లేక మూఢ విశ్వాసమా?

క్రైస్తవ విశ్వాసం అసత్యీకరణకు (Falsification) ఆస్కారం ఉన్న విశ్వాసం, ఎందుకంటే దేవుడు ఉనికిలో లేకపోయినా, సత్యం సాపేక్షమైనా, యేసుక్రీస్తు చారిత్రక పురుషుడు కాకపోయినా, ఆయన మరణాన్ని జయించి పునరుత్థానుడు కాకపోయినా అది వ్యర్థం అని రుజువైపోతుంది. ఇలాంటి అనేక రంగాల్లో క్రైస్తవ విశ్వాసం యొక్క హేతుబద్ధతను పరీక్షించవచ్చు. అయితే యేసుక్రీస్తు పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి మూలస్తంభం అంటే అతిశయోక్తి కాదు. అందుకే క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసం వ్యర్థమే అంటాడు పౌలు భక్తుడు (1 కొరింథీ 15:17). క్రీస్తు పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి అత్యంత ప్రాముఖ్యమైనదని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. క్రీస్తు పునరుత్థానం చారిత్రక సత్యం కాకపోతే: (1 కొరింథీ 15:15-19)

* ఏది సత్యమని భావించి అపొస్తలులు తమ ప్రాణాలను సహితం ఫణంగా పెట్టారో ఆ ప్రకటన అప్రయోజనకరమైనది మాత్రమే కాదు అసత్యమని తేలిపోతుంది.
* అపొస్తలులు దేవుని పేరిట అసత్యాన్ని ప్రచురం చేసిన అబద్ధసాక్షులుగా, మోసగాళ్ళుగా మిగిలి పోతారు.
* భవిష్యత్‌లో మనకు మరణానంతర జీవితాన్ని గురించిన నిరీక్షణ లేకపోగా గతంలో మన పాపాల్ని దేవుడు క్షమించాడన్న నిశ్చయత కూడా లేకుండా పోతుంది.
* యేసుక్రీస్తునందు విశ్వాసముంచి చనిపోయిన వారు, ఆయనకోసం హతసాక్షులైన వారు పాపక్షమాపణ లేకుండా నశించిపోయినట్లే.
* చెడు ముగింపుకు, పరిపూర్ణ న్యాయంకోసం క్రైస్తవ విశ్వాసం భవిష్యత్‌ను గురించిన నిరీక్షణతో ముడిపడి ఉంది. గనుక భూత, వర్తమాన, భవిష్యత్ విషయాల భ్రమల్లో బతుకుతున్న క్రైస్తవులు మనుష్యులందరికంటే దౌర్భాగ్యులుగా మిగిలిపోతారు.

క్రీస్తు పునరుత్థానం వల్ల వ్యక్తిగత, సంఘ జీవితాలకు ఆదరణాత్మక ప్రయోజనాలు ఉన్నాయి. "సంఘం ప్రభువు సిలువను ధ్యానించినంతగా ఖాళీ సమాధిని గురించి కూడా ధ్యానించి ఉంటే దాని జీవితం ఆనందదాయకంగానూ, లోకానికి దాని తోడ్పాటు మరింత క్రియాత్మకంగానూ ఉండేది" అని అంటాడు జార్జ్ బీస్లీ ముర్రే. క్రీస్తు పునరుత్థానాన్ని కేవలం ఆయన సిలువ మరణాన్ని దేవుడు అంగీకరించడానికి ఋజువుగా పరిమితం చేయడం పునరుత్థానాన్ని అర్థం చేసుకోవడంలో మన వైఫల్యాన్ని సూచిస్తుంది. క్రైస్తవ విశ్వాస జీవితం ప్రభావవంతంగా జీవించడానికి పురికొల్పి, శక్తినిచ్చే విషయం గనుకనే పునరుత్థానం ప్రాముఖ్యతను సంతరించుకుంది.

## పునరుత్థానం తాత్విక అవరోధాలు

యేసుక్రీస్తు స్వయంగా తన పునరుత్థానాన్ని గూర్చి బోధించడం జరిగింది. (మత్తయి 12:40; 16:21; 17:22; మార్కు 9:9; 10:32; 14:27; లూకా 9:30; యోహాను 2:19; 10:14; 16:16). పునరుత్థానాన్ని తిరస్కరించిన సద్దూకయ్యులను యేసు "లేఖనములను గానీ దేవుని శక్తిని గానీ ఎరుగక మీరు పొరబడుచున్నారు" అని ఖండించడం కూడా చూస్తాము. (మత్తయి 22:29). ఆయన నిర్గమ 3వ అధ్యాయంలోని భాగాన్ని మరణానంతర నిత్యజీవానికి ఆధారంగా చూపించి దేవుడు సజీవు లకే గానీ మృతులకు కాదని స్పష్టం చేయడం జరిగింది (మత్తయి 22:32). అయితే అద్భుతాలు జరిగే అవకాశాలు లేకపోయినా, వాస్తవాన్ని గూర్చిన సత్యజ్ఞానం సాధ్యం కాకపోయినా క్రీస్తు పునరుత్థానాన్ని విశ్వసించడం మూఢవిశ్వాసం అవుతుంది అనడంలో సందేహం లేదు. ఈ రెండు తాత్విక అవరోధాల్ని ముందు అధిగమించాలి.

### ఎ) అద్భుతాలు సాధ్యమవుతాయా?

చనిపోయిన వాళ్ళు తిరిగి బ్రతకడం తరచుగా జరిగే విషయం కాదు, అది సార్వత్రిక అనుభవం కూడా. మరణించి కొద్దికాలానికి మళ్ళీ బతకడం జరిగింది అని ఎవరైనా చెబుతున్నట్లయితే అది తప్పకుండా ఒక అసాధారణ సవాలే. డేవిడ్ హ్యూమ్ (1711-1776) అద్భుతాలు జరిగే అవకాశమే లేదని నిరూపించాడు గనుక పునరుత్థానానికి ఋజువులు తిరస్కరించవచ్చు అనేది కొందరి వాదన. డేవిడ్ హ్యూమ్ నిజంగానే అద్భుతాలు జరిగే అవకాశం లేదని నిరూపించగలిగాడా? కాదనే అంటున్నారు

> శిష్యులు శవాన్ని ఎత్తుకెళ్ళి ఉంటే ఆయన పునరుత్థానం కోసం ప్రాణం పెట్టే సాహసం వాళ్ళు చేయగలరా? ఒక అబద్ధం అని తెలిసిన విషయం కోసం ప్రాణాలు పోగొట్టుకొనే బుద్ధిహీనులా వాళ్ళు? వాళ్ళ నైతిక జీవితంతో ఈ సిద్ధాంతం పొసగగలదా? భయం, నిస్పృహల వల్ల ప్రాణాన్ని చేతపట్టుకొని పారి పోయిన శిష్యుల జీవితాలు సమూలంగా మారి పోవడానికి కారణం ఏంటి? యేసు మరణం తర్వాత ప్రత్యక్షమయ్యారనే అనుభూతుల్ని అనేకమంది పొందడానికి కారణం ఏంటి? యాకోబు, పౌలు లాంటి వాళ్ళు మార్పు చెందడానికి కారణం?

నేటి సమకాలీన తత్వవేత్తలు. ఆయన వాదం ప్రకారం 1. ప్రకృతి నియమాలన్నీ మార్పులేని ఒకే విధమైన అనుభవాల ద్వారా స్థాపించడం జరిగింది. 2. అద్భుతాలు ప్రకృతి నియమాలను ఉల్లంఘించడమే. 3. కాబట్టి మార్పులేని ప్రకృతి నియమాలను ఉల్లంఘించే అద్భుతాలు జరగవు. అయితే హ్యూమ్ వాదనలో చక్రీయ హేతుదోషం ఉంది. అసలు ప్రకృతి నియమాలు "మార్పులేని" నియమాలు అవ్వాలంటే కనీసం ఒక్క అద్భుతం కూడా జరగలేదు–జరిగే అవకాశమే లేదు అనేది రుజువు కావాలి. అద్భుతాలు జరగవు అని వాదిస్తున్న వాదన వాస్తవానికి వాటి అసాధ్యాన్ని "విశ్వాసం"తో ఊహించుకోవడంగా మిగిలిపోయింది. క్రీస్తు పునరుత్థానం సహజ సంఘటన అనేది క్రైస్తవుల వాదన కాదు, దేవుడు ఆయనను లేపాడు అని నమ్మారు. కాబట్టి దేవుడు ఉనికిలో ఉంటే అద్భుతాలు సాధ్యమే.

### బి) వాస్తవాన్ని గురించిన సత్యజ్ఞానం సాధ్యమేనా?

ఇమ్మానుయేల్ కాంట్ (1724-1804) వాస్తవాన్ని గూర్చిన సత్యజ్ఞానం సాధ్యం కాదు అని ప్రతిపాదించడం జరిగింది. అదే నిజమైతే చరిత్రలో క్రీస్తు పునరుత్థానం జరిగినా ఆ సంఘటనను గూర్చిన సత్యజ్ఞానం మనం తెలిసికొనే అవకాశమే ఉండదు. కాంట్ వాదన ప్రకారం 1. వాస్తవాన్ని గూర్చి మనకు ఇంద్రియాల ద్వారా వచ్చిన సమాచారంతో మనం ఏర్పరచుకొనే

భావనలే మన జ్ఞానం. 2. వాస్తవాన్ని గూర్చిన మన అవగాహనకు, అసలు వాస్తవానికి అగాధం ఉంది. 3. కాబట్టి మనం తెలుసుకొన్న విషయాలు వాస్తవం పట్ల మనం ఏర్పరచుకొన్న అభిప్రాయాలే తప్ప, వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్లుగా గ్రహించిన సత్యజ్ఞానం కాదు. ఈ వాదన కూడా లోప భూయిష్టమైనది. "వాస్తవాన్ని గూర్చిన సత్యజ్ఞానం లేదు" అని తెలుసుకోవడం కూడా "వాస్తవాన్ని గురించిన సత్యజ్ఞానాన్ని తెలుసుకోవడం" అని మర్చిపోకూడదు. కాబట్టి ఈ వాదన తనను తాను భంగపరచుకొంటుంది.

## పునరుత్థానం - చారిత్రక ఆధారాలు

యేసుక్రీస్తు పునరుత్థానానికి ఆధారాలను అన్వేషించేటప్పుడు చరిత్రకారులు నూతన నిబంధన దేవుని గ్రంథమని, అది సంపూర్ణంగా లోపరహిత గ్రంథమని అంగీకరించకుండానే చారిత్రక అంశాలను పరిశోధిస్తారు. అత్యంత విమర్శనాత్మక పండితులతో పాటు అత్యధిక పండితులు చారిత్రకంగా సత్యమని అంగీకరించి, ప్రత్యేకంగా ఒక్కొక్కటీ చారిత్రకంగా నిరూపించగలిగితే సుమారు 12 విషయాలను ప్రఖ్యాత క్రైస్తవ సమర్థవాది గ్యారీహబెర్‌మాస్ ప్రస్తావించారు.

## 12 చారిత్రక వాస్తవాలు

1. కఠినమైన సిలువ శిక్ష వల్ల యేసు చనిపోయారు.
2. యేసును సమాధి చేశారు.
3. యేసు మరణం శిష్యుల నిరీక్షణల్ని ఆక్షేపించగా వాళ్ళు సందేహించారు, నిశ్పృహకు లోనయ్యారు.
4. కొన్ని రోజుల తర్వాత యేసును సమాధి చేసిన సమాధి ఖాళీ అవ్వడాన్ని కనుగొన్నారు.
5. పునరుత్థానుడైన యేసును నిజంగా చూశాము అనే వాస్తవ అనుభూతులకు శిష్యులు లోనయ్యారు.
6. ఆయన శిష్యుల జీవితాలు ఈ సంఘటనల గూర్చిన సత్యాలకోసం చనిపోవడానికి సిద్ధపడేంతగా పరివర్తన చెందాయి.
7. తొలిసంఘ ప్రసంగాలకు సువార్త కేంద్ర స్థానం అయ్యింది.
8. యేసు చనిపోయిన పట్టణమైన యెరూషలేములో కూడా సువార్త ప్రకటన జరిగింది.
9. ఆ శిష్యుల చేతనే ఆదిమ సంఘం స్థిరంగా స్థాపించడం జరిగింది.
10. యేసు తిరిగి లేచిన రోజు అని ప్రకటించిన ఆది వారం ప్రధాన ఆరాధన దినంగా పాటించారు.
11. యేసును మొదట సందేహించిన ఆయన సోదరుడైన యాకోబు, తనకు ఆయన కనిపించాడన్న నమ్మకం వల్ల ఆయన శిష్యుడిగా మార్పు చెందాడు.
12. సంఘాన్ని హింసించే వాళ్ళకు నాయకుడైన పౌలు కూడా పునరుత్థానుడైన యేసు తనకు ప్రత్యక్షమయ్యాడనే వాస్తవ అనుభూతి వల్ల మారిపోయాడు.

## విఫల సిద్ధాంతాలు

యేసు పునరుత్థానాన్ని ఒక సాధారణ సంఘటనగా వివరించే అనేక సిద్ధాంతాలు చరిత్రలో చాలానే పుట్టుకొచ్చాయి. అయితే చారిత్రకంగా నిరూపించగలిగిన పై 12 చారిత్రక సంఘటనలను హేతుబద్ధంగా, తార్కిక పొందికతో వివరించడంలో ఈ సిద్ధాంతాలన్నీ విఫలమైపోయాయి. ఇలాంటి విఫలమైన సిద్ధాంతాలలో కొన్నింటిని ఇక్కడ చూద్దాం.

### ఎ) పునరుత్థానం కల్పిత గాథ

కల్పిత గాథలు పుట్టుకురావడానికి వాస్తవ సంఘటనలకు వాటిని గూర్చి చెప్పే సంగతులకు మధ్య కాలవ్యవధి ఎక్కువైయుండాలి, లేదంటే ప్రత్యక్ష సాక్షులు ఆ కథల్ని ఇట్టే కొట్టి పారేస్తారు. యేసు పునరుత్థానాన్ని గూర్చిన సమాచారం సంఘటనలకు అత్యంత సమీపంగా ఉన్న తొలికాలానికి చెందినది. ఈ సమాచారాన్ని ఇచ్చినవాళ్ళు ప్రత్యక్ష సాక్షులు. తొలిదినాల్లో యేసును పాతిపెట్టిన పట్టణంలోనే, సమకాలికులు ఇంకా బ్రతికి ఉండగానే బాహాటంగా పునరుత్థానాన్ని ప్రకటించడం కల్పితగాథ సిద్ధాంతానికి గొడ్డలి పెట్టు. ఖాళీ సమాధి, శిష్యుల జీవితంలో ప్రాణాల్ని పెట్టేంత సమూల మార్పును, సంఘ తొలిదినాల్లో ఈ సత్యం కేంద్ర బిందువుకావడం లాంటి చారిత్రక సత్యాలను ఈ సిద్ధాంతం వివరించడంతో విఫలమై పోయింది.

### బి) యేసు శరీరాన్ని దొంగిలించారు

బహుశా యేసు శరీరాన్ని సమాధి నుంచి తీసుకెళ్ళి ఉంటారు, ఖాళీ సమాధి చూసి ఆయన పునరుత్థానుడయ్యాడనే నమ్మకం పుట్టి ఉంటుంది అనేది ఈ సిద్ధాంత సారాంశం. గత రెండు శతాబ్దాలకు చెందిన దాదాపు అందరు పండితులు ఈ సిద్ధాంతాన్ని తిరస్కరించడం జరిగింది.

శిష్యులు శవాన్ని ఎత్తుకెళ్ళి ఉంటే ఆయన పునరుత్థానం కోసం ప్రాణం పెట్టే సాహసం వాళ్ళు చేయగలరా? అబద్ధం అని తెలిసిన ఒక విషయం కోసం ప్రాణాలు పోగొట్టుకొనే బుద్ధిహీనులా వాళ్ళు? వాళ్ళ నైతిక జీవితంతో ఈ సిద్ధాంతం పొసగగలదా? భయం, నిస్పృహల వల్ల ప్రాణాన్ని చేతపట్టుకొని పారిపోయిన శిష్యుల జీవితాలు సమూలంగా మారి పోవడానికి కారణం ఏంటి? యేసు మరణం తర్వాత ప్రత్యక్షమయ్యారనే అనుభూతుల్ని అనేక మంది పొందడానికి కారణం ఏంటి? యాకోబు, పౌలు లాంటి వాళ్ళు మార్పు చెందడానికి కారణం? ఇలాంటి అనేక ప్రశ్నలకు ఈ సిద్ధాంతం జవాబులు చెప్పడంలో ఘోరంగా విఫలమయ్యింది.

యూదుల దగ్గర ఆయన శరీరం ఉండి ఉంటే శరీరాన్ని బయటపెట్టి క్రైస్తవ్య పునాదుల్ని తొలిదినాల్లోనే పెకలించి ఉండేవారు, అలా చేయలేదు సరికదా శిష్యులు ఎత్తుకెళ్ళారనే కొత్త సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చారు. కాబట్టి యూదులు కూడా సమాధి ఖాళీగా ఉందన్న విషయాన్ని పరోక్షంగా అంగీకరించారు.

ఇంకెవరైనా తీసుకొని వెళ్ళినా శిష్యుల అనుభవాల్ని, యాకోబు, పౌలుల జీవితాల్లో వచ్చిన మార్పుల్ని ఈ సిద్ధాంతం వివరించలేదు.

### సి) యేసు సిలువలో సొమ్మసిల్లాడు

బహుశా యేసు సిలువ మీద చనిపోయి ఉండకపోవచ్చు, కేవలం సొమ్మసిల్లిన యేసు చనిపోయాడనుకొని సబ్బాతు దగ్గరగా ఉండడంతో తొందరలో సమాధి చేసి ఉండవచ్చు. సమాధిలోని చల్లని వాతావరణం వల్ల తేరుకొన్న యేసు సమాధిలోనుంచి బయటకు వచ్చి శిష్యులకు కనబడితే ఆయన పునరుత్థానుడయ్యాడనే నమ్మకంలోకి శిష్యులు వచ్చి ఉండవచ్చు అనేది ఈ సిద్ధాంత సారాంశం. ఈ సిద్ధాంతం కూడా పెను సవాళ్ళను ఎదుర్కొంటుంది.

* సిలువ వేసే విధానం జాగ్రత్తగా గమనిస్తే సిలువకు గురైన వ్యక్తి సిలువపై వేలాడిన స్థితిలో ఊపిరాడక చనిపోతాడు. సిలువలో యేసు శరీరంలో కదలికలు లేకపోవడాన్ని బట్టి ఆయన చనిపోయారనే నిర్ణయానికి రోమన్ సైనికుడు రావడం చాలా సులువైన విషయం. అయినప్పటికీ ప్రక్కలో పొడిచి ఆ విషయాన్ని ధృడపరచుకోవడం జరిగింది.
* "ఆధునిక వైద్యశాస్త్ర పరిజ్ఞానానికి యేసు సిలువలో చనిపోలేదు అనే ఊహ వ్యతిరేకంగాఉంది" అని అంటారు సిలువపై పరిశోధనలు చేసిన అమెరి కా దేశానికి చెందిన డాక్టర్స్ బృందం.
* 19వ శతాబ్దానికి చెందిన దైవశాస్త్రపండితుడు డేవిడ్ స్ట్రాస్ ఈ సిద్ధాంతం లోపభూయిష్టమైనదని సంపూర్ణంగా తిరస్కరించారు. "బలహీనంగా, అస్వస్థతతో వైద్యసేవల అవసరం కలిగి, గాయాలకు కట్లు, బలహీనతలో బలం అవసరం కలిగిన వ్యక్తి మరణాన్ని జయించిన వ్యక్తిగా, జీవితాలకు ప్రభువుగా శిష్యులను నమ్మించగలడా.. ఆ స్థితిలో పునరుజ్జీవం పొందిన వ్యక్తి శిష్యుల జీవితాల్లోని దు:ఖాన్ని ఉత్సాహంగా, భయాల్ని ఆరాధనగా ఖచ్చితంగా మార్చలేడు" అని అంటాడు.
* ఈ సిద్ధాంతం సౌలు జీవితాన్ని మార్చిన అనుభవాన్ని వివరించడంలో కూడా విఫల మవుతుంది.

### డి) భ్రమ సిద్ధాంతం

యేసు మరణానంతరం శిష్యులకు ప్రత్యక్షమైనట్లు వారికి కలిగిన అనుభవాలను వారి భ్రమగా ప్రతిపాదించేదే ఈ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం చాలా చారిత్రక సంఘటనల్ని వివరించడంలో విఫల మవుతుంది.

* శిష్యుల అనుభవాలు కేవలం భ్రమలుగా భావించినా, యేసు సమాధి ఖాళీగా ఎందుకు ఉందో ఇది వివరించలేదు.
* మానసిక శాస్త్రజ్ఞుల ప్రకారం భ్రమలు ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమించేవి కాదు, సామూహికంగా ఏకకాలంలో సంభవించేవి కాదు. కానీ యేసును చాలా మంది ఏకకాలంలో చూశామన్న అనుభవాల్ని ఇది వివరించలేదు.
* సాధారణంగా ఆశతో ఎదురుచూసే వ్యక్తులకు సంభవించే సంభావ్యత ఎక్కువ, కానీ శిష్యులు ఆయన పునరుత్థానుడు అవుతాడన్న నిరీక్షణ లేకుండా పిరికి పందల్లా పారిపోయిన వ్యక్తులు. వాళ్ళు సందేహించే అవకాశమే ఉంటుంది కానీ భ్రమపడే అవకాశాలు అత్యల్పం.
* ఒక ప్రత్యేక స్థలంలో గానీ, కాలంలో గానీ వ్యక్తులు భ్రమలకు లోనుకావచ్చు గానీ, యేసును

చూచినట్లు అనుభవాలు భిన్నమైన స్థల కాలాల్లో ఉన్నట్లు మనం గమనిస్తాం.

* సందేహించిన యాకోబు, క్రైస్తవ్యానికి శత్రువుగా బతికిన సౌలు ఎందుకు భ్రమపడతారు?

### ఇ) ప్రాచీన నిగూఢ మతాలనుంచి అరువు తెచ్చుకొన్నారు

యేసు పునరుత్థానాన్ని ప్రాచీన అనాగరిక మతాలలో అప్పటికే ఉన్న నమ్మకాలనుంచి సంగ్రహించారు అనేది ఈ సిద్ధాంత ప్రతిపాదన.

* గ్రీకు పురాణగాథల్లోని ఆటిన్ (Attis) పునరుత్థానుడైనట్లు ఏ ప్రాచీన ప్రతిలోనూ ఖచ్చితంగాలేదు, అలాగే అడోనిస్ (Adonis) ను ఆరాధించడాన్ని పునరుత్థానంతో ముడిపెట్టడానికి చేసే ప్రయత్నాలు కూడా ఆధారరహితమైనవి.
* ఈజిప్ట్ పురాణాల ప్రకారం మరణానంతర జీవితాలకు దేవుడైన ఒసైరన్ (Osiris) ముక్కలైన శరీరభాగాల్ని ఏకం చేసిన తర్వాత భూగర్భ ప్రపంచానికి ప్రభువయ్యాడు. దీన్ని పునరుత్థానంతో పోల్చడం ప్రశ్నార్థకమే అంటారు ప్రసిద్ధ థియోలాజియన్ బ్రూస్ మెడ్జగర్.
* ప్లుటార్క్ (Plutarch) ప్రకారం భక్తిగల విశ్వాసులు ఒసైరిస్ శరీరం ఇప్పటికీ ఏ ప్రదేశంలో ఉందో అదే చోట తమ శవాలను పాతిపెట్టాలని కోరుకొంటారు. ఇది పునరుత్థానం ఖచ్చితంగా కాదు.
* అందుకే "మరణించి తిరిగి లేచిన దేవుడు తన పట్ల విశ్వాసం చూపిన వారిని నిత్యజీవానికి నడిపించే ఆలోచనే ప్రాచీన గ్రీకు పౌరాణిక మతాలలో ఎక్కడాలేదు" అని అంటారు ఫ్రెంచ్ దేశానికి చెందిన పండితుడు ఆంద్రీ బౌలాంగర్.

### మన స్పందన

"క్రీస్తు మనలను మన అహాల విషయంలోనూ, స్వంత విలువల విషయంలోనూ చనిపోవడానికి పిలిచారు, అయితే శిష్యులుగా పిలుచుకోవడం అంటే క్రొత్త జీవితాలను జీవించడానికి కూడా" అని అంటారు డైట్రిచ్ బాన్‌హాఫర్. యేసుక్రీస్తు శిష్యులుగా నూతన జీవితాల్ని జీవించడం ఆయన పునరుత్థాన సత్యం వెలుగులో బతకడమే. ఆయన పునరుత్థానం మన జీవితాల్లోని అనేక రంగాల్ని ప్రభావితం చేస్తుంది.

1. దేవుడు క్రీస్తులో మన పాపాల్ని క్షమించారు అని పునరుత్థానం ద్వారా ఋజువైనప్పుడు, అదే క్రీస్తు క్షమాగుణాన్ని అనుసరించాలి.
2. దేవుడు క్రీస్తును ప్రథమ ఫలంగా మృతులలో నుండి లేపారు (1 కొరింథీ 15:20), గనుక మన పునరుత్థానంలో మన శరీరాలను కూడా విమోచిస్తారన్న నిరీక్షణ ఉంది. దేవుడు కేవలం ఆత్మల పట్ల మాత్రమే శ్రద్ధ కలిగిలేడని, మనిషిని ఆయన సంపూర్ణంగా చూస్తున్నారని అర్థమవుతుంది. మనుష్యుల్ని ఆత్మలుగా కాకుండా సంపూర్ణులుగా చూడడం, వ్యవహరించడం అల వర్చుకోవాలి.
3. మనల్ని బలపరచమని, ఆదరించమని చేసే ప్రార్థనలు మరణం గెలిచి పునరుత్థానుడైన క్రీస్తుకు చేస్తున్నామన్న స్పృహ మనదైనందిన జీవితాలను ప్రభావితం చేస్తుంది.
4. క్రీస్తు పునరుత్థానం ఆయన తన గూర్చి చేసిన అసాధారణ సవాళ్ళు సత్యమని అంగీకరించడానికి స్థిరమైన పునాది. కాబట్టి మన విశ్వాసం హేతుబద్ధమైనదే గానీ మూఢ విశ్వాసం మాత్రం కాదు.
5. మృత్యువుని జయించిన యేసు పునరుత్థానం కేవలం రాబోయే రాజ్యాన్ని మాత్రమే కాదు, మన ప్రపంచంలోనికి జీవితాలలోనికి యేసు ద్వారా ప్రవేశిస్తున్న దేవుని రాజ్యాన్ని కూడా సూచిస్తుంది. కాబట్టి మన వైఖరిని, జీవితాన్ని, ప్రవర్తనను ఆయన అధికారం కిందకు తెచ్చి ఆయన విలువలకు తగినట్లు జీవించాలి.
6. క్రీస్తు పునరుత్థానుడైనందున "సర్వసృష్టికి సువార్త ప్రకటించమని" ఇచ్చిన పరిచర్యలో మన పని ఎన్నటికీ వృథాకాదు, సదాకాలం మీతో ఉంటానన్న ఆయన వాగ్దానం గొప్ప భరోసాను ఇస్తుంది.

**– డి. అనిల్ కుమార్,** వైజాగ్

**Reference:**


1. Beyond Death: Exploring the Evidence for Immortality: Gary R. Habermas
2. The Cross Is Not Enough: Living as Witnesses to the Resurrection: Ross Clifford, Philip Johnson
3. The Gospel and the Greeks: Did the New Testament Borrow from Pagan Thought? Ronald H. Nash
4. "On the Physical Death of Jesus Christ" Journal of the american medical association, Vol-255,No.11(21 March 1986) William D Edwards



# ఐడా సోఫియా స్కడ్డర్

## సియంసి వెల్లూర్ వ్యవస్థాపకురాలు



*గత సంచిక తర్వాత...*

అప్పటివరకూ ఆమెకు సహకారిగా ఉన్న లోయిస హార్ట్ మదనపల్లి ఆసుపత్రికి బదిలీ అవ్వడం వలన 40 సంవత్సరాల ఐడా స్కడ్డర్ ఒక్కరే హాస్పిటల్, రోడ్డు పక్కల నిర్వహించే డిస్పెన్సరీలను నిర్వహించే బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది. డాక్టర్స్ కొరత ఎక్కువగా ఉందని గ్రహించి ఈ కొరతను తీర్చడానికి, మహిళా వైద్యుల కోసం ఒక మెడికల్ కాలేజీని తానే ప్రారంభిస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన ఆమె మనస్సులో మెదలింది. రాబోయే తరాలకు భారతీయ వైద్యులను తయారు చేయాలనే దర్శనంతో ఆమె ఈ ఆలోచన చేసింది.

### మెడికల్ కాలేజి పట్ల దర్శనం

ఆమె ఈ ప్రతిపాదనను ఒక మెడికల్ కాన్ఫరెన్స్ ముందు ఉంచితే, అందరూ ఆమెను నిరుత్సాహపరిచారు. మహిళలకు మెడికల్ కాలేజీ అనే ఆలోచననే అక్కడ ఉన్నవారు తిరస్కరించారు. నువ్వు కాలేజీ పెట్టినా గానీ భారతీయ మహిళలు జాయిన్ అవ్వలేరు. ఎందుకంటే వారి కుటుంబ సభ్యులు ఒప్పుకోరు. దానికి కావలసిన అనుమతులు, నిధులు సమకూర్చలేవు. ఇప్పటికే టాప్ 5 మెడికల్ కాలేజీలలో చదువుతున్న అబ్బాయిలతో వారు పోటీపడలేరని ఆమెను నిరుత్సాహపరిచారు. అయినా ఆమె పట్టువదలకుండా కాలేజి నిర్మించాలని ఆశిస్తున్న స్థలం దగ్గరకు వెళ్ళి అక్కడ కాలేజీ నిర్మాణమవ్వాలని తీవ్రంగా ప్రార్థన చేసేది. ఆమె అక్కడ పెద్ద పెద్ద వరండాలతో కూడిన విశాలమైన భవనాలు, తరగతి గదులలోని కిటికీలలో నుండి విద్యార్థులు సుందరమైన ప్రకృతిని చూస్తున్నట్లు ఆమె కలలు కంటూ ఉండేది. ఆ సంవత్సరం ఆమె చాలా బిజీ అయిపోయింది. ఆమె నిర్విరామంగా పని చేయాల్సి వచ్చింది. పుంగనూరులో కొత్తగా ట్యూబర్ క్యులోసిస్ శానిటోరియంని ప్రారంభించే బాధ్యత, విడువబడిన అనేక మంది అనాధ పిల్లలను పెంచే బాధ్యత ఆమె మీద పడింది. ఆసుపత్రిని 40 బెడ్స్ నుండి 60 బెడ్స్‌కి అదే సంవత్సరం విస్తరించడం జరిగింది. ఇంత అవిశ్రాంతంగా, పని భారంతో ఉన్నా, ఆమె మనస్సులో మాత్రం, కమిటీ కాలేజిని నిర్మించడానికి ఒప్పుకొంటుందా లేదా అనే భయం వెంటాడుతూ ఉండేది.

1902వ సం॥లో కమిటీ సౌత్ ఇండియాలోని మహిళలకు ఏ యూనియన్ మెడికల్ కాలేజి అనేది మంచి ఆలోచన అని ఆమె యొక్క ప్రతిపాదనను అంగీకరించడం జరిగింది. ఐడా తల్లి మాత్రం ముందుకు వెళ్ళవద్దని, ఇప్పటికే నువ్వు ముగ్గురు డాక్టర్స్ చేసే పని భారాన్ని మోస్తున్నావు అని ఆమెను నిరుత్సాహ పరచింది. అయితే ఐడాస్కడ్డర్ మాత్రం భారతీయ మహిళలకు వైద్య కళాశాల అనే ఆలోచనతో నిమగ్నమైపోయింది. ఆమె కళ్ళు మూస్తే డిప్లమో తీసుకొని తెల్లని శారీస్‌తో ఉన్న మహిళలు,

భారతీయ మహిళల మధ్య పని చేస్తున్న మహిళా వైద్యురాల్లే ఆమెకు కనిపించేవారు. ఇక్కడ ప్రశ్న ఏంటంటే, ఆమెకు దర్శనం ఉంది. దాని సాకారం చేసుకోవడం ఎలా? అన్నదే.

### మొదటిగా మెడికల్ స్కూల్ ప్రారంభం

ఏది ఏమైనా, ఆగష్టు 12,1918న మొదటిగా మెడికల్ స్కూల్ అధికారికంగా ప్రారంభమయ్యింది. ప్రభుత్వం నుండి అనుమతి లభించింది గానీ సమకూర్చుకోవాల్సిన సౌకర్యాలు చాలా ఉన్నాయి. క్లాస్‌లు నిర్వహించడానికి తగిన రూమ్స్, వైద్యపరికరాలు, సామాగ్రి లేవు. ఎన్నో సవాళ్ళు ఆమె ముందు ఉన్నాయి . ఒక్క అస్థిపంజరం మాత్రమే ఉన్నది. ఆమె ఆ గ్రామంలో ఉన్న బంగ్లాని క్లాస్ రూమ్స్ కోసం అద్దెకు తీసుకొంది. అక్కడ ఉన్న షెడ్‌ని డిసెక్షన్ రూమ్‌గా మార్చింది. వెల్లూరులో ఉన్న జైలు అధికారులు రెండు మృత దేహాలను పరిశోధనల కోసం ఈమెకిచ్చారు

మెడికల్ స్కూల్లో చేరడానికి 70 మంది బాలికలు అప్లై చేసుకొంటే అందులో 17 మందిని సెలెక్ట్ చేసింది. అందులో ముగ్గురు మధ్యలోనే వైద్య విద్యను విడిచి పెట్టి వెళ్లారు. అందులో చాలా మంది రక్తాన్ని చూసిన వెంటనే కళ్ళు తిరిగి పడిపోయేవారు. వారి ని బలపరుస్తూ, ఆమె ఒక్కరే బోధించేది. మొదటి సంవత్సరం పరీక్షల్లో జిల్లాలోనే 100% ఉత్తీర్ణత ఉన్న మెడికల్ స్కూల్‌గా ఆమె కాలేజి నిలిచింది. 1922వ సంవత్సరంలో 14 మంది కూడా ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఆ డిప్లమో ప్రధానోత్సవానికి వచ్చిన కల్నల్ బ్రైసన్ డా. ఐడాస్కడ్డర్ కేవలం దర్శనం కలిగిన మహిళ మాత్రమే కాదు, పట్టుదల కలిగిన మహిళ అని ఆమెను కొనియాడాడు.

### అవిశ్రాంత పోరాటం

1922వ సం॥ మే నెలలో మెడికల్ స్కూల్ కొరకు శాశ్వతమైన బిల్డింగ్స్ నిర్మించడానికి, మెడికల్ స్కూల్‌కి పెద్ద ఆసుపత్రి కట్టడానికి కావలసిన 2 మిలియన్ల డాలర్ల నిధులను సమీకరించడానికి ఆమె తల్లితో పాటు అమెరికాకు వెళుతుంది. ఆ సంవత్సరం చివరికి ఆమె నిధులను సేకరించాలి. ఆమె విశ్రాంతి తీసుకోకుండా అమెరికా, కెనడాలో అనేక ప్రాంతాలకు తిరిగి అవసరం చెప్పినా గానీ కొన్ని వేల డాలర్లను మాత్రమే సమకూర్చగలుగుతారు. డిసెంబర్ 31 న ఐడా, ఆమె స్నేహితురాలు అయిన యాన్నీ కన్నీటి పర్యంతమవుతారు. ఇంకా వారికి 50 వేల డాలర్ల కొరత ఉంది. బోర్డు వారు ఇంకా ఒక నెల గ్రేస్ పిరియడ్‌ని పెంచుతారు. దేవుడు అద్భుతంగా అమెరికాలోని క్రైస్తవ మహిళలను బలపరచి వీరికి అవసరమైన దానికంటే ఎక్కువ ధనాన్ని సమకూర్చాడు. ఆమె ఆ ఫండ్‌తో ఇండియా బయలుదేరి తన స్నేహితులతో కలసి మెడికల్ స్కూల్ భవనాలను, మెడికల్ స్కూల్‌కి అనుబంధంగా పెద్ద ఆసుపత్రిని నిర్మిస్తుంది. 1927వ సంవత్సరం, మార్చి 5 వ తేదీన వెల్లూరు మెడికల్ స్కూల్, హాస్పటల్ అధికారికంగా ప్రారంభమవుతుంది. ఆ వేడుక కోసం దాదాపు ఆ పట్టణం అంతా కూడా అక్కడే గుమికూడింది.

తన సన్నిహిత స్నేహితురాలైన గెట్రూడ్ ఇప్పటికైనా తన జీవితంలో కొంత కాలం విశ్రాంతి తీసుకొమ్మని ఐడా స్కడ్డర్‌ను బ్రతిమాలారు. 'నువ్వు ఎటువంటి ప్రదేశానికి వెళ్తానన్నా దానికి అయ్యే ఖర్చు మొత్తం నేనే భరిస్తాను' అని కూడా చెప్పింది. ఐడా స్కడ్డర్ కొంతకాలం హిమాలయాలకు వెళ్ళింది. అక్కడ నుండి ఐరోపాకు వెళ్ళి అక్కడ మెడికల్ కాన్ఫరెన్స్‌కి హాజరవుతూ, సర్జరీస్‌లో ఉపయోగిస్తున్న ఆధునాతనమైన పద్ధతులను పరిశీలించింది. నూతన పద్ధతులను నేర్చుకొంది.

### మెడికల్ స్కూల్ మెడికల్ కాలేజీగా రూపాంతరం

1930లో ఐడా స్కడ్డర్‌కు సహాయం చేయడానికి తన మేనకోడలు మెడిసిన్ పూర్తి చేసుకొని ఇండియాకు వచ్చింది. 1937లో మెడికల్ న్యూస్ పేపర్‌లో మద్రాసు యూనివర్శిటీతో అఫిలియేట్ అవ్వని అన్ని మెడికల్ కాలేజీలను మూసివేస్తామని న్యూ మినిస్ట్రీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఒక ప్రకటనను విడుదల చేసింది. అప్పటికే ఆ మెడికల్ స్కూల్ నుండి 229 మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అప్పటికే సంవత్సరానికి 1000 ప్రసవాలు జరుగుతున్నాయి. 36,000 మంది రోగులకు చికిత్స అందిస్తున్నారు. మద్రాస్ రీజియన్ అంతటిలో అత్యుత్తమ ఉత్తీర్ణతా శాతం ఉన్న కాలేజీ ఇదే. 1941లో మెడికల్ స్కూల్‌ని కాపాడడం కోసం 70 సంవత్సరాల వయస్సులో అమెరికాకు బయలుదేరారు. ఈ కో-ఎడ్యుకేషన్ కాలేజీ విషయంలో తన స్నేహితురాలైన లూసిని కోల్పోవలసి వచ్చింది. 1942వ సంవత్సరంలో

వెల్లూరు మెడికల్ స్కూల్‌లోనికి పురుషులకు కూడా ప్రవేశం కల్పించాలనే నిర్ణయం జరిగింది. ఆ మెడికల్ స్కూల్ తర్వాత వెల్లూరు మెడికల్ కాలేజిగా రూపాంతరం చెందింది. 1945లో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌తో అఫిలియేట్ చేశారు.

### డా. ఐడా స్కడ్డర్ ఆశ

1950, డిసెంబర్ 9వ తేదీ ఉదయకాల సమయంలో 'నాకు ఇంకా ఎనభై సంవత్సరాలు ఉంటే బాగుండు భారతదేశానికి సేవ చేయడానికి' అని తన మనస్సులో అనుకొన్నది. ఆమె తన 80వ పుట్టినరోజు సందర్భముగా ఆమెకు బహుమతిగా వచ్చిన 20,000 డాలర్లు, ఆమె యొక్క అకౌంట్‌లో ఉన్న 10,000 డాలర్లు కూడా అప్పుడే నిర్మిస్తున్న కట్టడానికి అవసరమైన నిధుల కోసం దానము చేసింది. ఆమె తన గురించి తాను ఎప్పుడూ ఆలోచించలేదు. కుష్టు రోగులకు యవ్వన వైద్యుడు చికిత్స చేస్తున్నప్పుడు ఆమె ఎంతగానో సంతోషించింది. సియంసి వెల్లూరు హాస్పటల్ ఇండియాలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన మొట్టమొదటి ఆసుపత్రిగా ప్రసిద్ధి గాంచింది. 1950 నాటికి 87 మంది మెడికల్ స్టాఫ్, అందులో సగము మంది భారతీయ వైద్యులే. అందులో చాలామంది ఆ మెడికల్ కాలేజీ విద్యార్థులే కావడం గమనార్హం. చిన్న గదిలో ప్రారంభమైన ఆ ఆసుపత్రి నుండి 544 బెడ్స్, 108 మంది నర్సులు, 174 నర్సింగ్ విద్యార్థుల వరకు చేరింది. 200 మంది మెడికల్ గ్రాడ్యుయేట్స్‌ని మెడికల్ కాలేజి తయారుచేసింది. 274 మంది నర్సులు ట్రైనింగ్ స్కూల్ నుండి తర్ఫీదు పొందారు. తర్వాత కాలంలో వారంతా భారత దేశం మొత్తము వ్యాపించారు. ఆమె ఒక్క సహాయకురాలితో ప్రారంభించి ఒక గొప్ప మెడికల్ సామ్రాజ్యాన్ని నిర్మించింది.

ఆ సమయంలో వెల్లూరులో ఉన్నవారందరు ఆమెకు కాంస్య విగ్రహం కడతామని ముందుకు వస్తే , ఆమె వారితో 'విలువైన దానిని చేయండి, ఆసుపత్రి కోసం దానిని ఖర్చు చేయండని' వారికి సూచించింది. ఆ డబ్బులతో ఆసుపత్రివైపు వెళ్ళే రోడ్డును నిర్మించారు. ఆమె వద్దని వారిస్తున్నా వెల్లూరు ప్రజలు ఆ రోడ్‌కు 'డా. ఐడా స్కడ్డర్ రోడ్' అని నామకరణం చేశారు. ఆమె మొదటిసారి ఆ రోడ్డు మీద నడుస్తున్నప్పుడు ఆమె తన మనస్సులో, ఇలాంటి రోడ్‌లలో రోడ్‌సైడ్ డిస్పెన్సరీలు ఉంటే ఎంత బాగుండేది అని అనుకొన్నారు.



### మరణం

డా. ఐడా స్కడ్డర్ మే 24,1960 న కొడైకెనాల్ లోని తన గృహములో తుదిశ్వాస విడిచారు. ఆమె భూస్థాపిత కార్యక్రమంలో కాలేజీ సూపరింటెంట్ కన్నీరు కారుస్తూ "అదృశ్యుడైన దేవునిని చూడగలిగిన వారు మాత్రమే అసాధ్యమైన వాటిని చేయగలరు. అదృశ్యుడైన దేవునికి సన్నిహితముగా ఉంటూ డా. ఐడా స్కడ్డర్ విశ్వాసం ద్వారా అసాధ్యమైన వాటిని సాధించింది' అని అన్నాడు. ఆమెను తన తల్లి యొక్క సమాధి పక్కన పాతిపెట్టినప్పటికీ ఆమె యొక్క వారసత్వం సజీవంగా ఉన్నది. 1960 సంవత్సరంలో అప్పటి భారతదేశ రాష్ట్రపతి అయిన బాబూ రాజేంద్ర ప్రసాద్ గారు 'గొప్ప మహిళ, ఆమె యొక్క డెడికేషన్, ప్రణాళికతో కూడిన ఆమె పని ఆదర్శనీయమని' కొనియాడారు.

### ముగింపు

ఐడా స్కడ్డర్ వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజి, దాని అనుబంధ ఆసుపత్రుల వ్యవస్థాపకురాలిగా ప్రసిద్ధి గాంచినది. అయితే ఆమె యొక్క వారసత్వం సంస్థ, భవనాల కంటే గొప్పది, విశిష్టమైనది. అందరూ ఆమెను 'ఏంజిల్ ఆఫ్ మెర్సీ' అని పిలిచేవారు. ఆమె సేవకు, త్యాగానికి, కరుణకు ప్రతిరూపం. ఆమె తన జీవితములో తను స్థాపించిన మెడికల్ కాలేజి ఆసియాలోనే అత్యుత్తమమైన, పెద్ద ఆసుపత్రిగా అవతరించడం తన కన్నులారా చూసింది. ఆమె ప్రజలకు త్యాగపూరితంగా సేవ చేయడంలో సఫలీకృతురాలయ్యింది. ఆమె తన జీవిత కాలములోనే, దేవుని పిలుపుకు విధేయత చూపించడం, దాని ఫలాన్ని చూడడం ఆమెకు లభించిన భాగ్యం. **సమాప్తం.**

– డా. పి. నాసరయ్య, వైజాగ్

ప్రత్యేకం




# సిలువలో విజయం

సాతాను దేవుని చేత సృష్టించబడినవాడు. సాతాను శక్తివంతుడే కావచ్చుగాని, దేవుడు సర్వశక్తిమంతుడు. అతను కూడా దేవునికి సేవకుడే అని గుర్తించాలి. యోబును శోధించుటకు దేవుని అనుమతి సాతానుకు వచ్చింది. సాతాను శోధించాడు. అప్పుడు యోబు యొక్క అత్యున్నత విశ్వాసం సర్వ లోకానికి తెలిసింది. దేవుడు సాతానును అలా ఉపయోగించుకున్నాడు. దేవుడు సర్వజ్ఞాని, అనంతుడు, సర్వవ్యాపి. అయితే సాతాను కాదు అని గ్రహించాలి. దేవుని అనుమతి లేకుండా హాని గాని, ఉపద్రవం గాని, మరణం గాని కలుగజేయలేడు (యోబు 1:12,16,19 2:2-6).

సాతానుకు భూత, భవిష్యత్, వర్తమానాలు తెలియవు. దానియేలు, అతని స్నేహితులు రాజు కల ను ప్రార్థించి తెలుసుకున్నారు గానీ శకునగాండ్రు, జ్యోతిష్యులు, గారడీ విద్యావేత్తలు తెలుసుకోలేక పోయారు (దాని 2:27,28). సాతాను సర్వజ్ఞాని కాదు దేవుడే సర్వజ్ఞాని.

## క్రయధనం ఎవరికి?

ఆయన మన కోసం క్రయధనం చెల్లించారు. "అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెననెను" (మార్కు 10:45). దేవుని న్యాయ సింహాసనం ముందు దేవునికి ప్రభువు క్రయధనం చెల్లించారు. క్రయధనం సాతానుకు కాదు. సాతానుకు ఆ హక్కు, అధికారం లేదు. ఎందుకంటే, సాతాను కూడా తిరుగుబాటు అనే పాపంలో ఉన్నాడు.

దేవుని నీతి న్యాయముల నెరవేర్పుగా క్రీస్తు ప్రభు తన ప్రాణము పెట్టి, రక్తం కార్చి క్రయధనం చెల్లించారు. ఆ దేవునికి మనం ఎంతైనా ఋణస్థులం.

## విశ్వాసికి విడుదల, విజయం ఎలా?

క్రీస్తు ప్రభువు సిలువ మరణం ద్వారా మనకు అద్భుత విజయం వచ్చింది. అపవాదికి మనపై ఆధిపత్యం పోయింది. క్రీస్తు ప్రభువు వారి త్యాగపూరిత మరణం ద్వారా మనిషికి రక్షణ, పాపంపై, సాతానుపై విజయం సాధ్యమైంది.

విద్యార్థులకు అర్థమయ్యే భాషలో చెప్పాలంటే మన క్రికెట్ జట్టు ఓపెనర్ త్వరగా అవుట్ అవుతుండడంతో ఓటమి తప్పడంలేదు. నాయకుడు ప్రారంభ బ్యాట్స్‌మన్‌గా వచ్చి జట్టును విజయతీరాలకు నడిపించడం లాంటిది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఓ జట్టుపై మరో జట్టు ఎప్పుడూ ఆధిపత్యం చెలాయిస్తుందనుకోండి. అలాంటి పరిస్థితుల్లో ఓ వ్యక్తి జట్టులోనికి వచ్చి ఎప్పుడూ ఓడిపోతున్న జట్టును తిరుగులేని ఆధిపత్యంతో గెలిపిస్తే మనమందరం సంతోషిస్తాం. క్రీస్తు ప్రభు మనకోసం సరిగ్గా అదే చేశాడు.

మనమందరం సాతాను చేతిలో పాప భారంతో ఓడిపోతున్నాం. క్రీస్తు ప్రభువు మనిషిగా జన్మించి మన జట్టులో ప్రవేశించి ఆయన (బోధ, జీవితం, సిలు వ మరణం) ద్వారా పాపపు శక్తినుండి, సాతాను ఆధిపత్యం నుండి విడుదల చేశారు, విజయం ఇచ్చారు (1 యోహాను 3:5,8, ఎఫెసీ 1:7). అందుకే సిలువ మరణం ఎంతో గొప్పది. ఆయనను మన జీవితంలోకి చేర్చుకొని క్రీస్తు పరిపాలనకు మన జీవితంలో లోబడితే సాతాను బంధకాలనుండి, అధికారం నుండి విడుదల పొందుతాం.

క్రీస్తు ప్రభువు వారి సిలువ మరణం మానవ విజయానికి నాంది. మనలను, క్రీస్తు ప్రభువు సిలువ మరణం ద్వారా విజేతగా నిలిపారు. ఆయనకు మనం ఎంతైనా కృతజ్ఞులం గనుక ఆ దేవుని ఆశయాల మేరకు జీవిద్దాం.

క్రీస్తు ప్రభువిచ్చే జయ జీవితాన్ని విశ్వాసంతో స్వతంత్రించుకుందాం. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుని సహాయం మనకందరికి దేవుడనుగ్రహించును గాక! ఆమెన్.

– దాసరి రాజేష్, స్టేట్ సెక్రటరీ
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్



కథానిక

# దోషుండ నేను ప్రభువా

*"సిలువకు నిను నే గొట్టితిని – తులవలతో జేరితిని*
*కలుషంబులను మోపితిని – దోషుండ నేను ప్రభువా"*

పాటతో వీధంతా మార్మోగుతోంది. ధర్మా కోలుతో చేసిన సిలువను మోస్తూ యేసు వేషంతో నడుస్తున్నాడొక యువకుడు. అతని వెనకాల పైనుంచి కింది వరకూ తెల్లని కోటు ధరించిన పాస్టర్స్, వారిని వెంబడిస్తూ తెల్లటి చీరల్ని తలనిండా ముసుగులు ధరించిన సమూహం పాడుతూ వారితో కలిసి నడుస్తున్నారు. ఈతాకు మట్టలకు పూలు గుచ్చి వాటిని చేతులతో పట్టుకొని ఊపుతూ చిన్నపిల్లలంతా హడావిడిగా ముందుకు సాగుతున్నారు.

భక్తిగా వారితో కలిసి సిలువ పాట పాడుతోంది శారమ్మ. చీరకొంగు గాలికి ఎగరకుండా నడుంకు కట్టుకుంది. సిలువపై తనకోసం మరణించిన క్రీస్తును తలచుకొని గుండెలు బాదుకొంటూ ఏడుస్తోంది. శారమ్మ కంటినుంచి ధారగా నీరు కారుతోంది. మధ్య మధ్యలో చీరకొంగుతో తుడుచుకొంటూ మిగతా వారిని వెంబడిస్తోంది. సమూహం వీధి మలుపు తిరిగింది. కళ్ళు తెరిచి కొద్దిదూరంలో కనిపిస్తున్న తన ఇంటివైపు, కుళాయి దగ్గర నీళ్ళు పట్టుకొంటున్న జనాల వైపు చూసింది. ఒక్కసారిగా ఏదో గుర్తుకొచ్చింది. తలమీద కప్పిన ముసుగు తీసి జుట్టు ముడేసింది. పక్కనావిడ చెవిలో ఏదో చెప్పి కుళాయివైపు కదిలింది.

ఒకరినొకరు తోసుకొంటూ నీళ్ళు పట్టుకొంటున్న ఆడ వాళ్లను పక్కకునెట్టి తన బిందె కుళాయి కింద పెట్టింది. చెమట్లు కక్కుతూ ఆయాసపడుతూ అక్కడ నుంచున్న ఆడవాళ్లలో కోపం రగిలింది.

"ఇప్పుడొచ్చి మాకంటే ముందుగా నీళ్లెలా పట్టుకుంటావు?" అడిగింది వాళ్లలో ఒకావిడ.

"పొద్దుననగా బిందె పెట్టాను. మీ అందరికంటే నేనే ముందు పట్టుకోవాలి" అంది శారమ్మ.

"అదేమీ కుదరదు. నువ్వు లేవు కాబట్టి ఇప్పుడొచ్చి పట్టుకుంటానంటే ఒప్పుకోం" ఒకరిద్దరు గొంతు కలిపారు.

"కుదరదు గిదరదు అన్నారంటే ఒక్కొక్కదాన్ని నరుకుతా. అడ్డుతప్పుకోండి" అంటూ వాళ్ళందర్నీ తోసుకుంటూ ముందుకు కదిలింది శారమ్మ.

'సిలువకు నిను నే గొట్టితిని...' పాట వినిపించడంతో బిందె పక్కన పెట్టి అక్కడున్న ఆడవాళ్ళందరి వైపు తిరిగి వేలు చూపిస్తూ "ప్రార్థన అవనీయండి.. ఒక్కొక్కదాని పని చెప్తాను. నా జోలికొస్తే ఎలా ఉంటుందో తెలిసొచ్చేలాగా చేస్తాను' అంటూ అక్కడి నుంచి కదిలింది.

❄❄❄

"ఏరా అంత డల్‌గా ఉన్నావు? ఒంట్లో బాగోలేదా?" అడిగాడు నవీన్.

ఏమీ మాట్లాడలేదు జాన్. కిటికీ వైపు చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

"ఏరా ఏమీ చెప్పకుండా అలా ఉన్నావ్. నువ్వు వస్తే అందరం కలిసి సినిమాకెళ్దాం అంటున్నారు ఫ్రెండ్స్. నువ్వేమో ఇలా ఒక్కడివే నీరసంగా కనిపిస్తున్నావు. ఏంటి సంగతి?" రెట్టించి అడిగాడు నవీన్.

"ఈరోజు గుడ్‌ఫ్రైడే కదా! ఎక్కడికీ రాను" అన్నాడు జాన్.

"మరి చర్చ్‌కి వెళ్ళలేదే!" అన్నాడు నవీన్

"వెళ్లాలనిపించలేదు"

"మరెలా? వాళ్ళు టిక్కెట్స్ తీస్తారేమో! వెళ్ళకపోతే వేస్ట్ అవుతాయిగా" అన్నాడు నవీన్ కంగారు పడుతూ.

"ఇవాళ కష్టంరా.. కుదిరితే రేపు చూద్దాం" అన్నాడు జాన్.

నవీన్ కళ్ళు ఆనందంతో మెరిశాయి. "అసలు రానంటావేమోనని హడలి చచ్చాను. నువ్వొస్తే రేపే వెళ్దాం" అంటూ బయటకు నడిచాడు నవీన్.

'సిలువకు నిను నే గొట్టితిని – తులువలతో జేరితిని' ఎక్కడి నుంచో లీలగా పాట వినిపించడంతో కుర్చీలో నుంచి లేచి కిటికీ వైపు నడిచాడు జాన్.

❄❄❄

''అయ్యగారు.. అయ్యగారు'' అనే పిలుపు వినిపించడంతో బయటికి వచ్చాడు కరుణాకర్.

"అయ్యగారు... ప్రాణం మీదకొచ్చింది. చేతిలో చిల్లిగవ్వలేదు. ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. వడ్డీ ఎక్కువైనా పర్వాలేదు. కాస్త డబ్బులిప్పించండి" ప్రాధేయపడుతూ అడుగుతున్న విక్టర్ వైపు అసహనంగా చూస్తూ "ఎప్పుడేం అడగాలో తెలియదా! చర్చిలో వాక్యం బోధించాలనే హడావిడిలో నేనుంటే డబ్బులు, డబ్బులని విసిగిస్తున్నావు. ఈరోజు గుడ్‌ఫ్రైడే.. పైగా శుక్రవారం! ఇవ్వడం అసలు కుదరదు. వెళ్ళిరా..." అంటూ లోపలికెళ్లబోయాడు కరుణాకర్.

''మీరే అలాగంటే ఎలా అయ్యగారు. ప్రాణంమీదకొచ్చిందని కంగారు పడుతున్నాను తప్ప.. నాకు మాత్రం తెలియదా శుక్రవారమని! మీరే కొంచెం పెద్ద మనసు చేసుకొని ఈ గండం నుంచి గట్టెక్కించాలి" అన్నాడు వచ్చినతను.

ఆలోచనలో పడిన కరుణాకర్ కాసేపయ్యాక 'సరే సరే చూద్దాంలే.. చర్చి అయ్యాక కనిపించు" అన్నాడు.

''అయ్యగారు.. మీరు ఆ మాట అనొద్దు. అవతల ప్రాణం మీదకొచ్చింది'' మరింత ప్రాధేయపడ్డాడతను.

లోపలికెళ్ళి విక్టర్ అడిగిన డబ్బు తెచ్చిస్తూ "లెక్కలన్నీ తెలుసని మళ్ళీ చెప్పట్లేదు. నెల కాగానే ఠంచనుగా వడ్డీ ఇవ్వాలి. లేకపోతే నా సంగతి తెలుసుగా" అన్నాడు కరుణాకర్.

చేతిలోని డబ్బును చూస్తూ ఒక్కసారి కళ్ళకద్దుకొని ఆకాశం వైపు చూస్తూ 'ప్రభువా నీకు వందనం' అన్నాడు విక్టర్.

'సిలువకు నిను నే గొట్టితిని...' సమూహం

**పాపాల్ని విడిచిపెట్టి మన ప్రవర్తన, జీవితాన్ని మార్చుకొన్ననాడే మనకు నిజమైన గుడ్‌ఫ్రైడే. అలా కాకపోతే మన ప్రవర్తన ద్వారా క్రీస్తును రోజూ సిలువ వేస్తూనే ఉంటాం!**

పాడుతున్న పాటను వింటూ లోపలికి నడిచాడు కరుణాకర్.

❄❄❄

మానవ జీవితమంతా చీకటికి బానిసగా మారుతోంది. పాపపు మరకలతో మలినమౌతోంది. గుడ్ ఫ్రైడే అంటే ప్రతీ సంవత్సరం ఆనవాయితీగా, ఆచారంగా చేసే పండుగలా మారిపోయింది. క్రీస్తును ప్రతీ సంవత్సరం సిలువ వేస్తూనే ఉంటాం. ఆ కాసేపు ముసుగు తొడుక్కుని గుండెలు బాదుకొంటాం, కన్నీళ్ళు కార్చేస్తాం. ఇతరుల కంటే ఎక్కువగా మన భక్తిని నలుగురిలో చాటుకోవడానికి తాపత్రయపడుతుంటాం!

ఆ రోజు దాటితే భక్తి అయిపోతుంది. క్రీస్తు త్యాగాన్ని, సిలువ ధ్యానాన్ని మర్చిపోతుంటాం. లోకంలో కలిసిపోతాం, లోకులతో మమేకమవుతాం. ఇదేనా క్రీస్తు సిలువ మనకిచ్చే సందేశం? ఇదేనా క్రీస్తు సిలువ త్యాగానికి అర్థం? మనందరం ఆలోచించాలి. పాపాలు చేస్తూ ప్రతీక్షణం పడిపోవడానికి దేవుడు మనల్ని సృష్టించలేదు. గుడిలో ఉన్నప్పుడు గుంద్రంగా, బయటికెళ్తే బల్లపరుపుగా బతకడానికి క్రీస్తు మనకోసం తన ప్రాణాన్ని అర్పించలేదు. ఒక వ్రతంలాగా, ఆచారంలాగా చేయడం శుభ శుక్రవారం యొక్క ఉద్దేశం కాదు. మన హృదయంలో పాపపు ఆలోచనల కుండ బద్దలవ్వాలి. అందులోనుంచి పశ్చాత్తాపం అనే ప్రవాహం మొదలవ్వాలి. అది పరివర్తన అనే బీజం మొలకెత్తడానికి నాంది కావాలి. అంతేగానీ, గుడ్‌ఫ్రైడే రోజు గుండెలు బాదుకొని, ఈస్టర్ రోజు ఎగిరి గంతేసి ఆ తర్వాత మామూలుగా బతికేయడం క్రైస్తవులుగా మనకు అవమానం!

మనల్ని మనం సంపూర్ణంగా క్రీస్తుయేసుకు అర్పించుకోవాలి. తలమీద ముళ్ళకిరీటం, ప్రక్కలో బల్లెపుపోటు, కాళ్ళు, చేతుల్లో మేకులు కొట్టించుకొని వేదనకరమైన మరణాన్ని పొందిన 'సిలువ మరణపు ఉద్దేశాన్ని' మనం మర్చిపోకూడదు. పాపాల్ని విడిచిపెట్టి మన ప్రవర్తనన, జీవితాన్ని మార్చుకొన్ననాడే మనకు నిజమైన గుడ్‌ఫ్రైడే. అలాకాకపోతే మన ప్రవర్తన ద్వారా క్రీస్తును రోజూ సిలువ వేస్తూనే ఉంటాం!

– డా. జడా సుబ్బారావు, నూజివీడు



# పౌలు బాటలో

దేవుని మాటలను
జీవజల ఊటలుగా
మూట కట్టుకుంటూ
ఉజ్జీవ ఉపన్యాసాలను
సంధించే సవాళ్ళుగా
గుండె గూటిపై గీసుకుంటూ
నెర్రలిచ్చిన నిర్ణయాలకు నియమాలు నేర్పుతూ
పగుళ్ళిచ్చిన పనితనానికి పదును పెడుతూ
పాలిపోయిన పరిమళానికి సువాసనలు అద్దుతూ
వాలిపోయిన ప్రార్థనలకు సానపడుతూ
పదండి పోదాం పౌలుబాటలోకి, విద్యార్థి పొలంలోకి...

ఆత్మహత్యలు రాజ్యమేలే
విద్యార్థి పొలంలో సిలువ నాటే
నాయకుడెవరని, నడిపించే నావికుడెవరని
పరిచర్య లేని ప్రాంతాలన్నీ
వేదనతో నివేదిస్తున్నాయి
నశించే ఆత్మల ఆక్రందనలు మిన్నంటే
స్టూడెంట్స్ సమాజానికి సువార్తను సంధించే
సంధాన కర్తలెవరని సమాధాన వ్యక్తులెవరని
ఎన్రిచ్ అవ్వని అన్రీచ్డ్ ప్రాంతాలు
అంతంలేని ఔట్రీచ్
ఏరియాలు ప్రశ్నిస్తున్నాయి...

ఏళ్ళుగా బీళ్ళుగా మారి
సువార్త కొరకై నోళ్ళు తెరుచుకొని
ఇంకెన్నాళ్ళు దున్నకుందురు
ఇంకెన్నేళ్ళు దున్నిన
ప్రాంతాలనే దున్నుతారు అని
బీడు భూములు
అడుగుతున్నాయి...
తరాలుగా తరగని అన్రీచ్డ్ ప్రాంతాలు
దశాబ్దాలుగా దశ దిశ ఎరుగని
ఔట్రీచ్ ఏరియాలు
అడుగు పెట్టి అడిగే వారికోసం
ఆశగా ఎదురు చూస్తున్నాయి...

శుద్ధమైన పాత్రగా మము చేయమని
నిశ్శబ్ద యుద్ధానికి తెరలేపుతూ
పదండి పోదాం పౌలు బాటలోకి
పదాలకి పాదాలు కలిపి
భారానికి బాధ్యత కలిపి
విద్యార్థి పొలంలో సువార్త విత్తనాలను విత్తుతూ
చీకటి పొలంలో చితికిన బతుకులను వెతుకుతూ
వెలుగు రవ్వలు వెదజల్లుతూ
విద్యార్థి జ్వాలను మండిస్తూ
గ్రాడ్యుయేట్స్‌గా గార్డియన్స్‌గా
తరాలకు తరగని దర్శనాన్ని అందిస్తూ
పరిచర్యకు పునరంకిత మవుతూ
విద్యార్థి లోకం వైపు
వెనుతీయని అడుగేద్దాం...

– **రమణ,** పామిడి

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-03-2025**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# సిలువ-సవాలు



ఈ క్లిష్ట సమయంలో నేను నీకో సవాలు విసురుతున్నా
రక్షకుని శక్తితో సిలువ ధ్వజాన్ని భుజాన వేసుకోమని
దేవుని కోసం మానవుని కోసం ఏదో కొంత చేయమని
రక్షకుని నిత్య ప్రణాళికలో నువ్వు కూడా భాగం కమ్మని.

ఈ అంత్య దినాలలో నేను నీకో సవాలు విసురుతున్నా
ఈ లోకంలో క్రీస్తును ప్రకటించే సవాలును స్వీకరించమని
నీ జీవితకాలం ఎంత సంక్షిప్తమైనదో నువ్వు తెలుసుకోమని
దేవుని కోసం మానవుని కోసం యోగ్యమైనది చేయమని.

దేవుని కుమారుని సిలువను నువ్వు చూసినప్పుడు
హతసాక్షులు చిందించిన రక్తాన్ని నీవు చూసినప్పుడు
ఈ వాస్తవాల వెలుగులో నీ వైపు నీవు చూసుకొన్నప్పుడు
దేవుని కోసం మానవుని కోసం నీవేం చేశావో చెప్పు?

రక్షకుని హృదయాన్ని నీవు సంతోషపెడుతున్నావా?
రక్షకుని త్యాగంలో నీవు పాలు పంచుకొన్నావా?
నీ ప్రేమ నిజమైనదని క్రీస్తుకు నీవు నిరూపించగలవా?
మానవాళి రక్షణ కోసం నీవేం క్రయం చెల్లిస్తున్నావు?

యేసు కోసం ఏదైనా చేసేందుకు నడుము బిగించు!
ఆయన ముళ్ళ మకుట నొసటికి స్వర్ణ కిరీటాన్ని ఇవ్వు
నీ సిలువను క్రిందికి దించకు! ముందుకు కదిలిపో!
నిద్రపోకు ఆయన ప్రణాళికను నెరవేర్చే వరకు.

– వెస్లీ ద్యూవెల్